
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శనివారం 15 నవంబరు 2025

'మీ సేవ'లన్నీ ఇక సీఎస్‌సీలోనే!

వివిధ ధ్రువపత్రాలు, సేవల కోసం ఇప్పటి దాకా మీసేవా కేంద్రాలు, సచివాలయాలను ఆశ్రయిస్తున్నాం. ఇకపై ఈ సేవలన్నీ ఒకేచోట అందించడానికి నగరం, పట్టణ ప్రాంతాలలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. మహిళలకు ఉపాధి చూపడంతోపాటు వారికి ఆర్థిక తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రైల్వే, బస్సు, విమాన టికెట్ల బుకింగ్, ఫోన్, కరెంటు బిల్లుల చెల్లింపులు, పోస్టల్, బ్యాంకింగ్ సేవలు, పాస్‌పోర్టు స్లాట్ బుకింగ్, వివిధ ధ్రువపత్రాల అందజేత తదితర 712 సేవలు ఈ సెంటర్ల ద్వారా ప్రజలకు అందనున్నాయి.



- మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో 315 కేంద్రాలు
- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఏర్పాటు
- పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబనకే..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెప్మా పరిధిలో ఉన్న నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో 315 కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. నెల్లూరులో 171, కావలిలో 64, కందుకూరులో 41, ఆత్మకూరులో 28, బుచ్చిలో 11 కేంద్రాలను ఈ నెలాఖరులోపు ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరులోని రాంనగర్‌లో ఈ నెలాఖరులోగా తొలి సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. మెప్మా పొదుపు సంఘంలో 10వ తరగతికి పైబడి చదివి, కంప్యూటర్‌లో పరిజ్ఞానం ఉన్న మహిళలను సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటు కోసం ఎంపిక చేశారు.



నెల్లూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కామన్ సర్వీస్ సెంటర్

● ఒక్కో సెంటర్‌కు రూ.2.92 లక్షలు

ఒక్కో సెంటర్‌ను రూ.2.92లక్షలతో ఏర్పాటు చేయనున్నారు. వీటిలో బంకుతో పాటు కంప్యూటర్లు, స్కానర్లు, బిల్లింగ్ మిషన్లు, కుర్చీలు తదితరాలు ఉంటాయి. ఇందుకు అవసరమయ్యే రుణాన్ని యూనియన్ బ్యాంకు ద్వారా ఇప్పించడానికి మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సెంటర్ల నిర్వహణ ద్వారా పొదుపు మహిళకు నెలకు రూ.10వేల నుంచి 50 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. సర్వీస్ చార్జీ రూపంలో ఈ ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.



ఉత్సాహం

మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

భారత మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులతో కేకులు కట్ చేయించి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆటపాటలతో బాలలు అలరించారు. వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు.

25న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం ఈ నెల 25న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలకు సంబంధించి స్థాయి సంఘ సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి స్థాయి సంఘ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్లు, సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.



రండి బాబు రండి!

కిలో మటన్ రూ.500లే

సాధారణంగా కిలో మటన్ వెయ్యి రూపాయలు. ప్రాంతాలను బట్టి ఈ ధరలో మార్పు ఉంటుంది. అయితే, నెల్లూరులోని బీవీ నగర్ ప్రాంతంలో శుక్రవారం రూ.500లకే కిలో మటన్ ఇస్తున్నారని తెలియడంతో జనం ఎగబడ్డారు. క్యూలో నిలబడి మరీ మటన్ కొనుగోలు చేశారు. ఇంత తక్కువ ధరకు ఎందుకు ఇస్తున్నారని ఆరా తీస్తే సదరు దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా వ్యాపారి ఈ బంపర్ ఆఫర్ ఇచ్చాడని తెలిసింది. ఏదైతేనేం... సగానికి సగం ధరకే కిలో మటన్ దొరకడంతో ప్రజలు మాత్రం ఎగబడ్డారు. కొసమెరుపు ఏమిటంటే గొడవలు జరగకుండా ఓ కానిస్టేబుల్ పహారా కాయడమే.

సోమశిల జలాశయం నీటిమట్టం

అనంతసాగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి శుక్రవా రం ఎగువ ప్రాంతాల నుంచి 6,828 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇక డ్యాంలో 72.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 58.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 800 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు.



నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్

- రేపటి నుంచి అందుబాటులోకి..
- 7 ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ
- ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్, అండర్‌బ్రిడ్జిలకు మరమ్మతులు
- 45 రోజులపాటు మూత
- ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోండి
- కార్పొరేషన్ కమిషనర్ నందన్

- వివరాలు 8లో..



అధికారుల నిర్లక్ష్యం

సోమశిల ఉత్తర కాలువకు ముప్పు

- వివరాలు 8లో..

సీసీఆర్‌సీలు అందేనా!?

● కౌలు రైతులకు ప్రయోజనం చేకూరేనా.. ● కార్డుల పంపిణీ లక్ష్యం 38వేలు.. ఇచ్చినవి 20,451

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సొంత భూములున్న రైతులతోపాటు కౌలు రైతులకు కూడా సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు(సీసీఆర్‌సీలు)లు మంజూరు చేస్తోంది. అవగాహన లోపం కారణంగా ఎక్కువమంది కౌలురైతులకు ఇవి దక్కడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వీటి ఉపయోగాలు చెబుతున్నారు. అయినా భూయజమానులను ఒప్పించి కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు వెనుకబడిపోతున్నారు.



సీసీఆర్‌సీ పత్రం

● కార్డు వల్ల ప్రయోజనాలివే..

సీసీఆర్‌సీ ద్వారా సాగుదారు బ్యాంకు నుంచి రూ.1.60లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందవచ్చు. రుణం చెల్లింపు బాధ్యత పూర్తిగా సాగుదారుపైనే ఉంటుంది. పంట నష్ట పరిహారం, పంటల బీమా పథకం, సున్నా వడ్డీ లబ్ధి, కనీస మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం వారు చేసే పంట కొనుగోళ్లకు కూడా ఉపయోగపడుతుంది. వ్యవసాయశాఖ ద్వారా అందించే పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వివిధ పైర్ల విత్తనాలను రాయితీపై పొందవచ్చు. రైతుకు పెట్టుబడి సాయం అందించే అన్నదాత సుఖీభవ పథకానికి సైతం అర్హత పొందవచ్చు.

● పంపిణీ లక్ష్యం 38వేలు

జిల్లాకు రబీ సీజన్‌లో ఏడు లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తున్నట్లు ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో ప్రకటించారు. జిల్లాలో సుమారుగా రెండు లక్షల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈఏడాది 38వేల సీసీఆర్‌సీ ఇవ్వాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. ఇప్పటి వరకు

- మిగతా 6లో..



ఇంటర్ పరీక్షల్లో సమూల మార్పులు

- ఎంపీసీలో మ్యాథ్స్‌కు ఒకటే పరీక్ష
- బైపీసీలో జువాలజీ, బోటనీ కలిపి బయాలజీ
- ఫిజిక్స్, కెమిస్ట్రీలకు మార్కుల పెంపు

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం ప్రధాన పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీకి 500 మార్కులు ఉండగా వీటిలో రాత పరీక్షకు 470, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15) 30 మార్కులు ఉంటాయి. గతంలో మ్యాథ్స్ సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహిస్తుండగా పేపర్-1ఏకు 75, పేపర్-1బీకి 75 మార్కులు కలిపి 150 మార్కులు ఉండేది. ఈ ఏడాది నుంచి దీనిని కుదించి మొత్తం 100 మార్కులు ఒకే పేపర్‌ను నిర్వహించనున్నారు. అలాగే ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజెస్‌కు 100 మార్కులు చొప్పున రెండు పరీక్ష పత్రాలు అందించనున్నారు. మ్యాథ్స్‌కు 35 పాస్ మార్కులుగా నిర్ధారించారు. అలాగే బైపీసీకి 500 మార్కులు ఉండగా ఇందులో రాత పరీక్షలకు 455 మార్కులు, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15, బోటనీ, జువాలజీ 15) 45 మార్కులు ఉంటాయి. గతంలో బోటనీ 60 మార్కులకు, జువాలజీ 60 మార్కులుగా ఉండేవి. ఈ ఏడాది నుంచి ఈ రెండు ప్రశ్నపత్రాలను కలిపి ఒకే ప్రశ్నపత్రంగా 85 మార్కులుగా అందించనున్నారు. ఆన్సర్‌షీట్‌లు మాత్రం రెండుగా ఉండనున్నాయి. బోటనీ 43, జువాలజీ 42 మార్కులుగా ప్రశ్నలుంటాయి. దీనికి 29 మార్కులు వస్తే ఉత్తీర్ణతగా ప్రకటిస్తారు. ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌లకు 100 మార్కుల చొప్పున పరీక్ష పత్రాలను అందించనున్నారు. ఈ విధానంలో ఫస్టియర్

- మిగతా 6లో..

గ్రంథాలయాలకు చేరువ కావాలి

8లో

కోల్డ్ రూము నిర్మాణానికి రాయితీలు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంట కోత అనంతరం ఉత్పత్తులను కాపాడుకునేందుకు కోల్డ్ రూము నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పండ్లు, పూలు ఎక్కువ రోజుల నిల్వ ఉంచేందుకు కోల్డ్ రూంలను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. ఒక రైతు గరిష్ఠంగా 70 మెట్రిక్ టన్నుల వరకు పరిమితి ఉన్నట్లు తెలిపారు. ఒక కోల్డ్ రూం నిర్మాణానికి మొత్తం రూ.12.5లక్షలకు రూ.4.3 నుంచి 5లక్షల వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. పండ్ల తాజాదనం, రంగు, రుచి ఆకృతిని పాడుచేయకుండా పక్వానికి రావడం కోసం రైపనింగ్ చాంబర్స్ ఉపయోగపడతాయని, ఈ నిర్మాణానికి రూ.లక్షక గాను 35శాతం రాయితీ అందుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఉద్యానశాఖ అధికారి, 7995086780 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



హౌసింగ్ పీడీతో చర్చిస్తున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి

పేదల ఇళ్లను నాణ్యతగా నిర్మించండి

- వారి సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- హౌసింగ్ అధికారులకు నుడా ఛైర్మన్ ఆదేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో పీఎంఏవై కింద నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నుడా కార్యాలయంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు అత్యంత నాసిరకంగా ఉన్నాయన్నారు. అధికారులు జాగ్రత్తలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. గతంలో తాము నిర్మించిన టిడ్కో ఇళ్లను నిరుపేదలకు ఇస్తే టీడీపీకి మంచిపేరు వస్తుందన్న దుర్బుద్ధితో గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వలేదని కోటంరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లను నాణ్యతగా నిర్మించి, పేదలకు పదికాలాల పాటు ఇబ్బందులు లేకుండా ఉండేలా సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా హౌసింగ్ అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ వహించి, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గత ప్రభుత్వంలో కాంట్రాక్టరు అవినీతి చేసి తిన్న ప్రతిపైసా కక్కిస్తామని, ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నక్ష' పరిధిలోకి ప్రభుత్వ ఆస్తులు

నెల్లూరు(సిటీ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, భవనాలు, ఆలయాలు, ప్రధాన మార్గాలు, మేజర్ కాలువలన్నీ నక్ష ప్రాజెక్టు ద్వారా మ్యాపింగ్ చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. శుక్రవారం ఎన్ఎంసీలో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులుతో మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన ఆస్తులన్నీటిని నక్షలో పొందుపరచాలని చెప్పారు. ఈ ప్రాజెక్టు పై పూర్తి అవగాహనతో వ్యవహరించాలన్నారు. అనంతరం రిత్విక్ ఎన్‌క్లేవ్, జకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.



ఆర్టీసీ కార్మికుల పోరుబాట

- వివరాలు 7లో..

మీ సమస్య సరే.. మాకేంటి!?

మహిళా పోలీసు స్టేషన్‌లో పరిస్థితి ఇదీ!

డీఎస్పీ సస్పెన్షన్‌తో రాష్ట్రవ్యాప్తంగా కలకలం

కుటుంబ వివాదాలను గోప్యంగా, సామరస్యంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో నెలకొల్పిన మహిళా పోలీసు స్టేషన్.. కొంతమంది అధికారులు, సిబ్బంది తీరుతో అభాసుపాలవుతోంది. ఇక్కడకు ఫిర్యాదు చేసేందుకు వెళుతున్నారంటే జేబుల్లో డబ్బులు పెట్టుకొని వెళ్లాలన్నంత తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌లో ఇరు వర్గాల నుంచి అందినకాడికి పిండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఈ స్టేషన్ డీఎస్పీ సస్పెన్షన్‌కు గురవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నారని ఓ మహిళ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం, విచారణలో అది వాస్తవమని తేలడం మహిళా పోలీసు స్టేషన్‌లో పరిస్థితిని ప్రతిబింభిస్తోంది. ఏకంగా డీఎస్పీపైనే చర్యలు తీసుకోవడం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.

నెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలను సర్దుబాటు చేయడంలో మహిళా పోలీసు స్టేషన్ కీలక మధ్యవర్తి (కౌన్సెలింగ్ సెంటర్)గా ఉంటుంది. అక్కడ సిబ్బందిని నియమించే విషయంలోనూ ఉన్నతాధికారులు గతంలో సునితంగా పరిశీలించేవారు. పోలీసు అధికారుల గత ట్రాక్ రికార్డును పరిశీలించడంతో పాటు స్కిల్స్‌ను పరీక్షించాకనే ఈ స్టేషన్‌కు విధులు కేటాయించేవారు. ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బందికి వారి జీతంతపాటు మరో 30 శాతం అదనంగా వేతనం లభిస్తుంది.



అయితే ఇటీవల కాలంలో వివాదాస్పద అధికారులు, సిబ్బందే మహిళా పోలీసు స్టేషన్‌కు ఎక్కువగా వస్తున్నారు. అదనపు జీతంతోపాటు పైఆదాయం వస్తుండటం, అదే సమయంలో ఒత్తిడి లేని ఉద్యోగం కావడంతో రాజకీయ సిఫార్సు ఉన్నవారు ఇక్కడ తిష్ట వేస్తున్నారు. ఇక్కడ ఏం జరుగుతోంది? కేసుల పరిష్కారం ఎలా ఉంది? బాధితులకు న్యాయం జరుగుతుంది.? అన్నది ఇటీవల కాలంలో ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోతుండటం కూడా అవినీతిపరులకు కలిసొస్తోంది.



● అంతర్గత వివాదాలు!

మహిళా పోలీసు స్టేషన్‌కు రోజుకు సరాసరి ఐదుకుపైగా ఫిర్యాదులు అందుతుంటాయి. అయితే వాటిలో కేసులు కట్టేవి చాలా తక్కువ. సరాసరి రోజుకు ఒక ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాదు. చాలా ఫిర్యాదులు కౌన్సెలింగ్ దశలోనే ముగుస్తుంటాయి. ఈ ప్రక్రియలోనే మతలబు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ మహిళ వచ్చి తన భర్తతోపాటు వారి కుటుంబ సభ్యులపై ఫిర్యా దు చేస్తే వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. చివరగా ఆ పార్టీ నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. ఇక కేసు నుంచి ఒక వ్యక్తిని తప్పించాలంటే దానికీ ఇక్కడ అవకాశముందని చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఫ్యామిలీ కేసుల్లో అయితే ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉందన్న ప్రచారముంది. అయితే ఇవన్నీ వ్యక్తిగత సమస్యలు కావడంతో బాధితులు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఇదే మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేసేవారికి అవకాశంగా మారింది. వచ్చే ఫిర్యాదులను విభజించడంలో ఇటీవల వివాదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. డబ్బులొచ్చే కేసుల విషయంలో పోటీ నెలకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు సిబ్బందే డీఎస్పీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయించారన్న ప్రచారం కూడా ఉంది. జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపిస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇళ్లు కూల్చడం మంచి పద్ధతి కాదు!

తోటపల్లిగూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తోటపల్లిగూడూరు నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం మంచి పద్ధతి కాదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని తోటపల్లి పంచాయతీ డక్కిలివారిపాలెంలో శుక్రవారం కూల్చిన నివాసాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కష్టపడి నిర్మించుకున్న నివాసాలను రాజకీయ కక్షలతో కూల్చడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11985
వెండి కిలో ధర	రూ. 164500
వెండి ఒక గ్రాము	రూ. 170.50

సచివాలయాల తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు బుచ్చి మున్సిపాలిటీలోని పెద్దూరు, రామకృష్ణానగర్ సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్లైన్ అటెండెన్స్‌తోపాటు పలు రికార్డులను పరిశీలించారు. ప్రతీ కార్యదర్శి ఎంక్వయిరీ, ఫీల్డ్ విజిట్ రెండు సందర్భాలలో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సహకార బ్యాంకుల ద్వారా రైతులకు విస్తృత సేవలు

విడవలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు కోవూరు సహకార బ్యాంకు ద్వారా విస్తృత సేవలను అందిస్తున్నామని బ్రాంచ్ ఛీఫ్ మేనేజర్ పీవీ లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని గాదెలదిన్నె గ్రామంలో శుక్రవారం కోవూరు సహకార బ్యాంకు ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు, పలు పథకాల గురించి కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరిణి కోఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ కొరిమెర్ల వెంకటేశ్వర్లు, బ్యాంకు సూపర్‌వైజర్ పి. బాబు సొసైటీ సీఈఓ సుధీర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉమీద్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి

● జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్



మాట్లాడుతున్న మత పెద్ద నేతలు

పొదలకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఉమీద్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, వక్ఫ్ ఆస్తులను కాపాడడం ప్రతి ముతవల్లి, కమిటి సభ్యుని బాధ్యత అని మాజీ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్.జమీర్‌బాషా, మత పెద్ద ముస్తాక్ మదానీ అన్నారు. గురువారం స్థానిక జామియా మసీద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమీర్ బాషా మాట్లాడుతూ డిసెంబరు 6లోపు వక్ఫ్ ఆస్తుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజన్‌లా గౌరవ వేతనాన్ని ఒకే దఫా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా అమల్లోకి వచ్చిన ఉమిద్ యాక్ట్ ప్రకారం, రాష్ట్రంలోని అన్నీ వక్ఫ్ ఆస్తులు, మసీదులు, దర్గాలు, మదరాసాలు, అషూరా ఖానాలు తప్పనిసరిగా డిజిటల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వక్ఫ్ సంస్థల నిర్వాహకులకు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ జనాబ్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని, ముస్లింలు అందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, నాయకులు నన్నేసాహెబ్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

రావిళ్లవారిపాళెంలో గ్రామసభ

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుకొల్లు పంచాయతీ రావిళ్లవారి పాళెంలో శుక్రవారం స్వామిత్వ ప్రత్యేక గ్రామసభను ఎంపీడీవో చెంచమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో గ్రామకంఠం గుర్తించడంతోపాటు నివాసాల కొలతలు సేకరించి ప్రజల వద్ద నుంచి అభ్యంతరాలు స్వీకరించారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

అనంతసాగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల ఫీజును శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డికి అందజేశారు. 24 మంది విద్యార్థులకు రూ. 125ల చొప్పున అందజేశారు.

ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఛాంపియన్ రైతులకు శుక్రవారం ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్, విఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయంలో పూజలు

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాలెంలో ఇటీవల దాతల సహకారంతో నిర్మించిన విజయ గణపతి, నాగేంద్రస్వామి, మహాలక్ష్మమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

● రెండు పంచాయతీలకు కొత్త భవనాలు
● కమ్యూనిటీ హాలు, రేడియో హౌసే దిక్కు
● కొమ్మలపూడి, కాగితాలపూరు గ్రామస్థుల హర్షం

మనుబోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ ఆ గ్రామాల ప్రజలకు పంచాయతీ కార్యాలయం అంటే ఏమిటో తెలియదు. ఎందుకంటే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా ఆ పల్లెల్లో నేటికి పంచాయతీలకు భవనాలు లేవు. సొంత కార్యాలయాలు లేవు. మరి ఇన్నాళ్ళు పంచాయతీల్లో ప్రజాకార్యక్రమాలు, ప్రభుత్వ కార్యకలాపాలు ఎలా నిర్వహించారంటే ఆ ఊర్లలో ఉండే రేడియోహౌస్, కమ్యూనిటి హాలులోనే అంతా. ప్రభుత్వ అధికారి ఎవరొచ్చినా ఇక్కడే సమావేశం. గ్రామానికి సంబంధించి ఏ కార్యక్రమం చేయాలన్న అక్కడే. గ్రామసభలు, వైద్యసేవలు, కరెంటు బిల్లులు అక్కడే నిర్వహిస్తుంటారు.



కొమ్మలపూడిలోని కమ్యూనిటీ హాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల్లో పంచాయతీ భవనాలు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో మండలంలోని కాగితాలపూరు, కొమ్మలపూడి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు కావాలని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఎమ్మెల్యే అధికారులతో చర్చించి కాగితాలపూరు, కొమ్మలపూడి గ్రామాలకు పంచాయతీ కార్యాలయాలు నిర్మించుకునేలా ప్రభుత్వంచే జీవో విడుదల చేయించారు.

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద రూ.25లక్షలు, జాతీయగ్రామీణ మహాత్మాగాంధీ ఉపాధిహామి పథకం కింద రూ.7లక్షలు ఈ భవనాల నిర్మాణాలకు గ్రాంటు ఇచ్చేలా కలెక్టర్ హిమాన్షుశుక్లా కొద్ది రోజుల క్రితం పంచాయతీ రాజ్ అధికారులకు ఉత్తర్వులు అందజేశారు.

పట్టించుకోని గత ప్రభుత్వం

పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన గత ప్రభుత్వం చేయలేదు. పైగా పంచాయతీలకు వచ్చే కేంద్ర, రాష్ట్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించేసిందన్న విమర్శలు లేకపోలేదు. అయితే సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చినా చాలా గ్రామాల్లో సచివాలయాల నిర్మాణం జరగలేదు. ఆ గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలనే సచివాలయాలుగా పేరుమార్చి కొద్ది సంవత్సరాలు నడిపారు.

పంచాయతీల నిర్మాణం ఇలా...

రెండు పథకాల నిధులతో పంచాయతీ భవనాల నిర్మాణం సాగనుంది. రూ.32 లక్షలతో మీటింగ్ హాలు, సిబ్బంది గది. సర్పంచు గది, కార్యదర్శి గది, సామాగ్రి నిల్వ ఉంచే గది నిర్మాణం చేయనున్నారు. వీటితో పాటుగా రెండు మరుగుదొడ్లు నిర్మిస్తారు. 1226 చదరపు అడుగుల విస్తీర్ణంలో పంచాయతీ కార్యాలయం రూపు దిద్దుకోనుంది. వచ్చే ఏడాది అంటే 2026మార్చి 31నాటికి పంచాయతీ భవనాలు పూర్తి చేయాలని, దగ్గరుండి పర్యవేక్షణ చేసే బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. గత టీ డీపీ ప్రభుత్వంలో అంటే 2014-19 మధ్య కాలంలోనే మండలంలోని పిడూరుపాళెం, చెరుకుమూడి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు నిర్మించారు.

ఒక్క ప్రభుత్వ భవనం లేదు



నేను చిన్నప్పటి నుంచి మా ఊరిలో రేడియో హౌస్ ఒక్కటే ఉండేది. అందులోనే గ్రామానికి, ప్రభుత్వానికి చెందిన కార్యక్రమాలు నిర్వహించేవారు. గత ప్రభుత్వం సచివాలయం, ఆర్ఎస్‌కే, విలేజ్ క్లినిక్ ఇలాంటివేమి మా ఊర్లో కట్టలేదు. ఇకనుంచి ఎమ్మెల్యే చొరవతో అన్ని నిర్మాణాలు చేయించాలని చూస్తున్నాం.

- వెడిచెర్ల వెంకటరమణారెడ్డి, కాగితాలపూరు నీటిసంఘం అధ్యక్షుడు

ఎమ్మెల్యే సోమిరెడ్డి కృషి వల్లే...



మా గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలుపుతున్నాం. మా ఊరికి పంచాయతీ భవనం మంజూరు చేయించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. భవనం నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించాం. ఎమ్మెల్యే చేత త్వరలో శంస్థాపన చేయనున్నాం.

- మన్నెమాల భాస్కర్‌రెడ్డి, కొమ్మలపూడి టీడీపీ నాయకులు

గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే సోమిరెడ్డి



గృహ ప్రవేశాల సందర్భంగా వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గం లో గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందుకు పరిశ్రమల యాజమాన్యాలు తమ సీఎస్ఆర్ నగర్‌తో సహకరిస్తున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పిడతాపోలూరు, గిరిజన కాలనీలో శుక్రవారం 31 ఇళ్లలో గిరిజనులతో గృహ ప్రవేశాలు చేయించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. అంతకుముందు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్తుకూరు మండలంలో రూ.20 కోట్లు వెచ్చించి అత్యాధునిక వసతులతో 50 పడకల ఆసుపత్రి నిర్మించాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ఎస్ఈఐఎల్ కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మదేవం పరిధిలో ఏపీ జెన్‌కో క్రాస్ రోడ్డు వద్ద ప్రభుత్వం తరపున ఆసుపత్రి కోసం భూమి కేటాయిస్తామన్నారు. నర్సింగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేయబోతున్నారని, 50 పడకల ఆసుపత్రిలో వైద్య పరీక్షలతో సహా అన్నీ సేవలు ఉచితంగా అందిస్తామని ఎస్ఈఐఎల్ కంపెనీ సీఈవో మహాపాత్ర చెప్పారన్నారు. పిడతాపోలూరులో 62 ఇళ్లకు గాను 31 పూర్తయ్యాయని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఈ 31 ఇళ్లకు రూ.55.80 లక్షలు మంజూరు చేస్తే తమ ప్రభుత్వంలో చంద్రబాబు ఆ మొత్తాన్ని రూ.79.05 లక్షలకు పెంచారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.50వేలకు పైగా గిరిజనుల అభ్యున్నతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రి, ఎమ్మెల్యేగా వెలగబెట్టిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎస్ఆర్ నిధులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, నాయకులు సురేంద్ర, రవికుమార్ రెడ్డి, సురేష్‌రెడ్డి, రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు



కోవూరు : గ్రంథాలయ వారోత్సవాల్లో చిన్నారులు

కోవూరు, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని కోవూరు సర్పంచు యాకసిరి విజయ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. బాల బాలికలను పుస్తక పఠనం అలవాటయ్యేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కే భారతి, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు సత్యనారాయణ, అప్పల సుబ్బారావు, రజిత, పద్మరేఖ, సబీరా, లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: పుస్తక పఠనం, మాతృభాషపై మమకారం, మానసిక వికాసం, బాలసాహిత్యమే లక్ష్యంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించినట్లు హెచ్ఎం వేదవతి అన్నారు. శుక్రవారం బుచ్చి మున్సిపాలిటీలోని రామచంద్రాపురం పీఎంశ్రీ పాఠశాలలో హెచ్ఎం విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, మున్వర్, బ్రహ్మారెడ్డి, అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం ట్యాంపరింగ్‌తోనే బీజేపీ గెలిచింది



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మనుబోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) బీహార్ ఎన్నికల్లో ఈవీఎం టాంపరింగ్ వల్లే బీజేపీ గెలిచి ఉండవచ్చునని తిరుపతి జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్‌లో ఎన్నికల తరువాత వచ్చిన సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చాయన్నారు. ఆంధ్రా తరహాలో బీహార్‌లో 22 శాతం ఓటింగ్ ఉన్న బీజేపీకి 192 సీట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దీనిని బట్టే ఈవీఎంల టాంపరింగ్ అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టీ దేవదానం, శబరీష్ రెడ్డి, అధికార ప్రతినిధి పర్వతాల శ్రీనివాసగౌడ్, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి బళ్ళ హరి, మనుబోలు, టీపీగూడూరు అధ్యక్షుడు రమణయ్య, కిషోర్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బీహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంపై శుక్రవారం బుచ్చిరెడ్డి పాళెం లోని రిజిస్ట్రార్ ఆఫీసు సెంటర్‌లో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు ఆ ధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామిశెట్టి మోహన్ బాబు, నాయకులు శ్రీనివాసులు, లక్ష్మయ్య, నరసింహులు, ప్రవీణ్, మహేష్, నిగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు దూరం : ఎస్ఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారు ప్రాంతంలోని 167-బీజీ జాతీయ రహదారి గండిపాళెం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులు లైసెన్సు కలిగి ఉండడంతోపాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలూ.. దేవుడూ..చల్లనివారే!

● ఘనంగా బాలల దినోత్సవం
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
● ఆకట్టుకున్న 'బాల నెహ్రూ'లు

తోటపల్లిగూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : న్యాయస్థానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే వాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నచెరుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయస్థానాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పిల్లలకు మంచిచెడులను తల్లిదండ్రులే నేర్పించాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణ, లోక్ అదాలత్ గురించి వివరించారు. బాలలకు ఏ ఆపద కలిగినా 15100కి ఫోన్ చేయాలన్నారు. పిల్లలకు ఆధార్ కార్డు లేకపోతే జిల్లా జడ్జి ద్వారా పైఅధికారులతో మాట్లాడి అందేటట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టీ పద్మజ, అడ్వొకేట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఆములూరు పాఠశాలలో...

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సౌత్ ఆములూరులో శుక్రవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్ వరప్రసాదరావు మాట్లాడుతూ నెహ్రూ భారతదేశానికి మొదటి ప్రధానిగా సేవలందించి, అత్యున్నత భారతరత్న పురస్కారం అందుకున్నారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నెహ్రూ వేషధారణ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆర్ సువార్త, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా, కె వసంతలక్ష్మి, కె హెప్సీ విద్యుల్లత, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరు పాఠశాలలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

మనుబోలు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం చాచా నెహ్రూ గురించి పిల్లలకు వివరించారు. ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి అభినందించారు.

విడవలూరు: మండలంలోని చౌకచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమానికి పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పూర్వవిద్యార్థులు బహుమతులు అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థులు సమాధి శ్రీనువాసులు, పోలిరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, కందకూరు చంద్రశేఖర్, జలదంకి శ్రీనువాసులు, నాటకరాణి సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విడవలూరు: పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో సంబరాలు చేసుకున్నారు.

C.R.I.M.E N.E.W.S

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అపరాధ రుసుం వసూలు

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిదిమందిని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే. వెంకటరెడ్డి శుక్రవారం ఒకటవ అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి భరద్వాజ్ ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఎనిమిది మందికి రూ. 80 వేలు అపరాధ రుసుం విధించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం వద్ద రైలు పట్టాలపై ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు, వెంకటేశ్వరపురం శివాలయంవీధికి చెందిన డీ. మాలకొండయ్య (50) అనారోగ్య సమస్యలతో శుక్రవారం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి, కేసు నమోదు చేశారు.

రామాలయంలో చోరీ



చోరీ జరిగిన రామాలయం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదేవులపాడు రామాలయంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... గురువారం రోజువారీ పూజలు నిర్వహించిన స్థానికులు తాళాలు వేసి నివాసాలకు చేరుకున్నారు. అనంతరం గుర్తు తెలియని దుండగులు తలుపులకు వేసిన తాళాలు పగులకొట్టి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రాలను చోరీ చేసి పరారయ్యారు. ఉదయాన్నే అటుగా వెళ్ళిన కొంతమంది ఆలయం తాళాలు పగులకొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూసి సుమారు రూ. 50వేలు విలువ కలిగిన నాలుగు మంగళ సూత్రాలు చోరీ అయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ ముప్పసాని బాబు

చేజర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఏటూరు కండ్రిక గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. పూర్తి వివరాల మేరకు... నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన ముప్పసాని బాబు పొదలకూరు మండలంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి బైక్‌పై వస్తుండగా ఏటూరు కండ్రిక గ్రామ సమీపంలో ఒక్కసారిగా గేదెలు రోడ్డుపైకి రావడంతో అదుపుతప్పి బైక్‌పైనుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన ముప్పసాని బాబును అటుగా వస్తున్న ప్రయాణికులు గమనించి 108 ద్వారా పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసుల దాడి

● 28 మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించినట్లు కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని క్రాకుటూరులో బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంపై దాడులు చేసి 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీహరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. దీంతో సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు జరుగుతుంటే 9440902523కు సమాచారమివ్వాలన్నారు. ఈ మండలాల్లో గత 15 రోజుల్లో 28 కేసులు నమోదు చేసి 500 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సుమారు 50 మందిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేయించామన్నారు. బెల్టు దుకాణాల్లో మద్యాన్ని కల్తీ చేసే అవకాశం ఉంటుంది కాబట్టి వాటి నిర్మూలన కోసం ఈ దాడులు నిర్వహిస్తున్నామన్నారు.

సీసీఆర్‌సీలు అందేనా..!?

(5వ పేజీ తరువాయి)

సుమారుగా 20,451 వరకు కార్డులు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో ఇప్పటి వరకు లక్ష్యాలకు మించి సీసీఆర్‌సీలు అందజేశారు. ఇంకా కొన్ని మండలాల్లో లక్ష్యాలకు అనుగుణంగా అందచేయలేదు. అవగాహనలేమితో చాలా మంది రైతులు వీటిని అందుకోలేకపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూశాఖల సమన్వయంతో అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కౌలుకు భూమి ఇచ్చినట్లు అంగీకారపత్రం ఇవ్వడంవల్ల భూయజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అర్హత కలిగిన రైతులందరికీ సీసీఆర్‌సీ ఇప్పించడంతోపాటు వారికి రుణాలందేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ఇంటర్ పరీక్షల్లో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు రాసిన విద్యార్థులకు సెకండ్ ఇయర్‌లో కూడా ఇదే కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే ప్రశ్నపత్రాలుంటాయి.

● ఫస్ట్ ఇయర్‌లో 27వేల మంది

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది 187 కళాశాలల నుంచి 27వేల మంది విద్యార్థులు కొత్త విధానంలో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు. ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒరియంటల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధన జరుగుతోందని తెలిపారు.

నర్సరీ, ప్లాంటేషన్ల పరిశీలన

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి రేంజ్ పరిధిలోని నర్సరీ, ప్లాంటేషన్లను శుక్రవారం జిల్లా అటవీ శాఖాధికారి కె మహబూబ్‌బాషా, సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉదయగిరి మండలంలోని దుర్గంపల్లి నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం చేపట్టి సకాలంలో నీటి తడులు అందించాలన్నారు. అలాగే దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో ఉన్న ప్లాంటేషన్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఎఫ్‌బీవో లక్ష్మీప్రసన్న, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 600



ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్టీసీ రెండవ డిపో గ్యారేజ్ గేటు వద్ద నిరసన చేపట్టారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఆ పథకం పెట్టిన తర్వాత అక్రమంగా చేసిన సస్పెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షబ్బీర్, డిపో కార్యదర్శి చంద్ర, అధ్యక్షుడు జీ. శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శతజయంతి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామమూర్తినగర్ సత్యసాయిబాబా మందిరంలో శనివారం నుంచి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 23 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం 5గంటలకు నగర సంకీర్తన, సాయంత్రం బాబా నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. 19న మహిళా దినోత్సవం సందర్భంగా ఉదయం నగర సంకీర్తన, సుప్రభాతం, ఉదయం 8.30 గంటలకు ఉడ్‌కాంప్లెక్స్ ప్రగతి చారిటీస్‌లో నారాయణ సేవ నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉదయం 10.15 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పురిటి పిల్లలకు దుస్తులు, ప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 5గంటలకు వేద పఠనం, స్వామివారి అష్టోత్తర పారాయణం, అర్చన నిర్వహిస్తామన్నారు. 6గంటలకు భజన, సౌందర్యలహరి, సామూహిక కుంకుమ పూజలు, రాత్రి భక్తిసంగీత విభావరి ఉంటుందని తెలిపారు. 23 ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, పతాక ఆవిష్కరణ, వేదపఠన, భజనలు, సామూహిక సత్యనారాయణ వ్రతం, ప్రసాద వితరణ ఉంటుదని వారు తెలిపారు.

రాహుకాల ఉద్దాపన పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్దాపన పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు రాహుకాల, కార్తీక దీపారాధనలు చేశారు. మూలవర్లకు విశేష అలంకార పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కార్తీక దీపారాధన, కుంభహారతులు, పల్లకీసేవ జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

● **కార్తీక దీపారాధన**

మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక దీపారాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. సాయంత్రం శివపార్వతులకు ప్రాకారోత్సవం నిర్వహించారు.

10వ డివిజన్‌లో త్వరలో కల్వర్టుల నిర్మాణం

నెల్లూరు(సిటీ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 10వ డివిజన్‌లో ప్రజల సౌకర్యార్థం 13 కల్వర్టుల నిర్మాణం అవసరంగా ఉందని, వీటిని త్వరలో నిర్మిస్తామని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. స్థానిక డివిజన్‌లో శుక్రవారం అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి కల్వర్టుల సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరగా నిర్మాణాలు మొదలుపెడతామన్నారు. ప్రజలకు పారిశుధ్య, మురుగు సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలోనే నెల్లూరు కార్పొరేషన్ ఓ రోల్ మోడల్‌గా తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమల నాయుడు, వెంకటరావు, మల్లికార్జున్, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లో విజయంపై సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి భారీ విజయం సాధించడంపై నగరంలోని బీజేపీ నాయకులు శుక్రవారం విజయోత్సవాలు నిర్వహించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఈ వేడుకలు నిర్వహించి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, ఫణిరాజు, మొగరాల సురేష్, తదితరులు పాల్గొన్నారు. మూలాపేట సెంటర్‌లో బీజేపీ నాయకులు మిడతల రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికట్ల రాజేశ్వరి, పద్మావతి శ్రావ్య, అల్లూరు నాగేంద్రసింగ్, సుబ్బయ్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమలను నియంత్రించాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లార్వా దశలోనే దోమలను పూర్తిగా నివారించాలని సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని చాకలివీధి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించారు. నీటి నిల్వలు ఎలా ఉన్నాయి. దోమల నివారణ చర్యలు ఎలా చేస్తున్నారు వంటి వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా ప్రజలకు ఆయా వ్యాధులపై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్యాంసన్, హెల్త్‌అసిస్టెంట్ పెద్దయ్య, హెల్త్ సెక్రటరీలు, ఆశాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వోదయ కళాశాల మైదానంలో సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి శుక్రవారం ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలని కోరారు. నిబంధనలు అతిక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

బాలల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

- ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్
- ఘనంగా బాలల దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం); నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని డీకే కళాశాల నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, వారికి మంచి విద్య, పోషణ, మానసిక ఆరోగ్యం అందించటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా కార్మిక శాఖ అధికారి విజయకుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, ఏహెచ్‌టీయూ సీఐ కృష్ణారెడ్డి, డీకేడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరమణారెడ్డి, నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్,అధికారులు, విద్యార్థులు

● **సహకార సంఘాల ద్వారా సేవలు విస్తృతం**

సహకార సంఘాల ద్వారా రైతులకు, ప్రజలకు సేవలను విస్తృతం చేయాలని నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి కందుల వెంకటేశ్వర్లు అన్నారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని నెల్లూరు డివిజన్ కోఆపరేటివ్ కార్యాలయంలో శుక్రవారం సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సహకార అధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు అందుకున్న విద్యార్థులు

● **పిల్లలు ఓర్పు, నేర్పు అలవరుచుకోవాలి**

నెల్లూరు రూరల్ : చదువుకునే వయసులోనే చిన్నారులు ఓర్పు, నేర్పును అలవరుచుకోవాలని శేషు స్కూల్ కరస్పాండెంట్ బీ శేషుయాదవ్ అన్నారు. శుక్రవారం బుజబుజనెల్లూరులోని స్కూల్లో నిర్వహించిన చిల్డ్రన్స్‌డే, నెహ్రూ జయంతిని నిర్వహించారు. ముందుకు నెహ్రూ చిత్రపటానికి పిల్లలతో పూలమాల వేయించి నివాళి అర్పించారు. అనంతరం లుసిడ హ్యాండ్ రైటింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జశ్వంత్, టిప్పు, షాహుల్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

● **నెహ్రూ వారసులు ఇందిర, రాహుల్**

నెల్లూరు (వైద్యం) : తొలి ప్రధాని నెహ్రూ వారసులుగా ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ దేశ ప్రగతిలో తమదైన ముద్ర వేశారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తెలిపారు. నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నాయకులు సుధీర్, ఇర్ఫాన్, మల్లికార్జున్‌రెడ్డి, గణేష్, రిజ్వాన్, ధనుంజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని నెహ్రూ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

● **క్రీడా దుస్తుల పంపిణీ**

నెల్లూరు(విద్య) : నెహ్రూ జయంతిని పురస్కరించుకుని పొట్టేపాళెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు లెట్స్ హెల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం క్రీడా దుస్తులను అందచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వినయ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.సుజిత్, డాన్స్‌మాస్టర్ షేక్.సంధానిభాష, వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్.హస్నార, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల భద్రతకు చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐవో సభ్యురాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బాలల భద్రతకు చర్యలు తీసుకోవాలని చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి అస్మానురావు, సీఈవో మెంటార్ కోరారు. శుక్రవారం వారు నగర కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జంతువుల హక్కులు పరిరక్షిస్తూ నగరంలో వీధి కుక్కల బెడద నివారించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్, శాంతిభద్రతలు కల్పించి పిల్లలు స్వేచ్ఛగా తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అమీరా, అఫ్రోజ్, షేక్.అబ్దుల్‌సమీ, అన్వర్‌బాషా, సమీఉద్దీన్, తదితరలు పాల్గొన్నారు.

నారాయణలో ప్రీమియర్ లీగ్

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పత్తేఖాన్‌పేట నారాయణ పాఠశాలలో ఈ కిడ్స్ విభాగం వారు నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన కోఆర్డినేటర్ దీప్తి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రఘురామ్, ప్రిన్సిపాల్ ఎ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ వలర్మతి, పీఈటీ రుషికేశ్, ఏవో వెంకటరాముడు పాల్గొన్నారు.

● **బాలల దినోత్సవం...**

నగరంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూ వేషధారణతో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నరేంద్రరెడ్డి, ప్రిన్సిపాళ్ల వెంగళరావు, సోనీ తదితరులు పాల్గొన్నారు.

సీడాప్ శిక్షణ పరిశీలన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో నగరంలోని బీవీ నగర్‌లో నిర్వహిస్తున్న లావా శిక్షణ కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ వీ. నాగరాజకుమారి శుక్రవారం పరిశీలించారు. శిక్షణ ఏర్పాట్లను, భోజనం, ఇతర వసతులపై శిక్షార్థులను ప్రశ్నించారు. ఆసెంటర్‌లో టీవీఎస్ కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ విద్య అనేది జీవితానికి బలమైన పునాది అని, ఉద్యోగం చేస్తూ దూరవిద్యద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. లావా కోర్సులో శిక్షణ పొందాలనుకొనేవారు 0861-2321261 నంబరులో సంప్రదించాలని కోరారు ఈ కార్యక్రమంలో జేడీఎం పీ. హైమావతి, కిరణ్మయి, సుగుణమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో డీఆర్‌డీఏ పీడీ, జేడీఎం

ఢిల్లీలో ఉగ్రదాడి దారుణం : సీపీఐ

నెల్లూరు (వైద్యం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఉగ్రదాడి జరగడం దారుణమని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్‌లు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో నగరంలోని అజాద్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఢిల్లీలో ఉగ్రదాడి కారణంగా 13 మంది మృత్యువాత పడటం దారణమన్నారు. ఈ దాడులు చేసేవారు ఏమతం వారైనా క్షమించరాదన్నారు. ఇందుకు కేంద్రంలోని బీజేపీప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు లతీఫ్ అహ్మద్, షాజహాన్, సర్తాజ్, మున్నా, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఇన్సాఫ్, సీపీఐ నాయకులు

చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు గుర్తించాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు వెంటనే గుర్తించి వైద్య నిపుణులను కలవాలని మెడికవర్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఉదయకీర్తి, డాక్టర్ వెంకటసురేష్ పేర్కొన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్‌లో చిన్నారులు, తల్లిదండ్రులతో అవగాహన సదసు జరిగింది. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ చిన్నారులకు సరైన పోషకాహారంతో పాటు వ్యాధినిరోధక టీకాలు ఇవ్వటం వల్ల వారి ఆరోగ్యం ఎంతో బాగుంటుందని తెలిపారు. చిన్నారులపై తల్లిదండ్రులకు సరైన ఆరోగ్య అవగాహన ఉండాలన్నారు. పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి సమావేశం నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముందుగా నిర్వహించిన పిల్లల ఆటపాటలు అలరించాయి.



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు

ఇరగాళమ్మ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇరుగాళమ్మ ఆలయం తూర్పు ముఖ ద్వార నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. ఈ పనుల అంచనా విలువ సుమారు రూ.20లక్షలు. ఈ మొత్తాన్ని దాత ముళ్ల చిన్నబాబు అందజేశారు. ఈ మేరకు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం దాత ముళ్ల చిన్నబాబును ఆలయం తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, చైర్మన్ ఓటూరు సురేంద్రయాదవ్, జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి కే. జనార్దన్‌రెడ్డి, ఈవో వి.గిరికృష్ణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు అల్లం లక్ష్మి, శమ్మినేని వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో
నూరుశాతం విజయమే లక్ష్యం

టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 20వ డివిజన్‌లోని హనుమాన్ జంక్షన్ వద్ద సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక స్థానిక డివిజన్ అభివృద్ధి రూ. 5.70 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆ దిశగా అభివృద్ధి పనులు కేటాయిస్తున్నాట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేష్, నాయకులు భానుశ్రీ, మదన్‌కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మధుమేహానికి ప్రత్యేక వైద్య చికిత్సలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణ ఆసుపత్రిలో మధుమేహం వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు నారాయణ ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రావులపల్లి హరీష్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ సునంద తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో మధుమేహంపై అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవటం, జంక్‌ఫుడ్ తీసుకోవటం, ఊబకాయం వల్ల మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధికి ఆసుపత్రిలో మూడు ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయంటూ వాటికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ సిద్ధానిఖిత్, డాక్టర్ మేరిగ రాజేష్, ఏజీఎం డాక్టర్ మంజుప్రభ పాల్గొన్నారు.

రేపు గౌడ సంఘీయుల కార్తీక వన మహోత్సవం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘీయుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు గౌడ సంక్షేమ సంఘం సీనియర్ నేత ఉదయగిరి నరసింహులు గౌడ్ చెప్పారు. శుక్రవారం నగరంలోని గౌడ సంక్షేమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా గౌడ సంక్షేమ సంఘం, గౌడ ఉద్యోగుల సం ఘం, గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్తీక దీపం ప్రజల్వనతో పాటు మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు. అనంతరం సామూహిక వనభోజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో గౌడ సంఘ నేతలు వెంపులూరు భాస్కర్‌గౌడ్, దద్దోలు రమణయ్య, ఏపూరి రమేష్, తుళ్లూరు మల్లిఖార్జున, మోర్ల శివ, తాత హేమంత్, తిరకాల శివగౌడ్ పాల్గొన్నారు.



కార్తీక వనమహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉదయగిరి నరసింహులు గౌడ్, భాస్కర్ గౌడ్ తదితరులు

వైభవంగా శ్రీనివాసుడికి పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వికాస్ ప్రజాహిత సేవాసమితి వారి ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి అభిషేకం, పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, పుష్పయాగం జరిగాయి. ఉదయం 8గంటలకు మరకత గణపతి స్వామికి, అభిషేకం, 8.30గంటలకు శ్రీవేంకటేశ్వరుడికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు, గడ్డం శ్రీధర్‌రెడ్డి, సుజన దంపతులు వ్యవహరించారు. అన్నప్రసాద వితరణ ఉభయకర్తలుగా రాఘవ సుధాకర్, కుమారి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులకు శ్రీదేవి,భూదేవి పాదాల చెంత ఉంచిన చీరలను లక్కీడిప్ ద్వారా 20 మందికి అందించారు. ముగ్గురు మగవారికి స్వామివారి పాదాల దగ్గర ఉంచిన వస్త్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, సెక్రటరీ రత్నం, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన కలిగిస్తున్న మధుమేహం

నెల్లూరు (వైద్యం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మధుమేహం ఆందోళన కలిగిస్తున్నదని అపోలో వైద్య నిపుణులు తెలిపారు. శుక్రవారం అపోలో ఆసుపత్రిలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ బిందురెడ్డి, ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రామ్మోహన్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్లో మధుమేహం ఒకటన్నారు. అధిక బరువు, వ్యాయామం లేక పోవటం, అనారోగ్య కారణాలు, మానసిక ఒత్తిడి, వంశపారపర్యంగా ప్రభావం వంటి అంశాలు మధుమేహానికి ప్రధాన కారణాలన్నారు. మధుమేహం ఉన్న వారిలో రక్తపోటు, హృద్రోగాలు, కిడ్నీ, కంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్కువ చక్కెర, తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురష్కరించుకుని రూ. 2100 విలువైన పరీక్షలను రూ. 699కే అందిస్తున్నామన్నారు. రూ. 4500 విలువైన వైద్య పరీక్షలను కేవలం రూ. 1899కే అందిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న అపోలో ఆసుపత్రి వైద్యనిపుణులు

ఇరుగాళమ్మ ఆలయం వద్ద అగ్ని ప్రమాదం

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుగాళమ్మ ఆలయం పక్కనే ఉన్న దుకాణంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని దుకాణంలో మంటలను అదుపు చేయడంతోపాటు పక్క దుకాణానికి వ్యాపించకుండా చూశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని దుకాణం యజమాని పూల శీనయ్య తెలిపారు. మంటలు ఆర్పడంలో ఎల్‌ఎఫ్ కే. చంద్రశేఖర్, కానిస్టేబుళ్ల ఇలియాజ్, మధు, మల్లికార్జున్, నరహరి, హోంగార్డు వెంకయ్య పాల్గొన్నారు.





50 చక్రాల బండి...
ఎంత పెద్దదోనండి !

సంగం మండలంలో ముంబాయి రహదారిపై శుక్రవారం 50 చక్రాల వాహనం చూపరులను ఆకట్టుకుంది. భారీ బాయిలర్ డ్రమ్మును ఈ 50 చక్రాల ట్రాలీపై తరలిస్తున్నారు. దీనిని సిమెంట్ ఫ్యాక్టరీలో వినియోగించడానికి చెన్నై నుంచి కర్నాటకకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు. భారీ వాహనం కావడంతో హైవేపై కూడా 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతోనే వాహనాన్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం చెన్నైలో బయలుదేరినట్లు తెలిపారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు చేరువ కావాలి

● జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు చేరువైతే, ఉన్నత విద్యతోపాటు పోటీ పరీక్షల్లో నెగ్గి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్రం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలతో కలిసి జేసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, పుస్తకాలు, గ్రంథాలయాల ఆవశ్యకత నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ వారం రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కవి సమ్మేళనం, సాహితీ చర్చలు, ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు వివరించారు. బాలికల శాస్త్రీయ నృత్యంతో ప్రారంభమైన వారోత్సవాలు మొదటి రోజు ఆహ్వానితుల సన్మానంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ డీ రామకృష్ణ, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో జేసీ



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, తదితరులు

నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్

● ఏడు ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ ● రేపటి నుంచి అమలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ఏడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆదివారం నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్ అండ్‌బీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి ఆయన సమావేశమై, మాట్లాడారు. సుమారు రూ.1.50 కోట్లతో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కంట్రోల్ ప్యానెల్ వ్యవస్థను అనుసంధానించే కార్యక్రమం మరో రెండు రోజుల్లో పూర్తి అవుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసుల కంట్రోల్‌తోపాటు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కూడా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను క్రమశిక్షణగా పాటించాలని తెలిపారు.

● ఈ ప్రాంతాల్లో...

రామలింగాపురం సెంటర్, కనకమహల్‌సెంటర్, వీఆర్సీ, కూరగాయల మార్కెట్, కేవీఆర్, డీకేడబ్ల్యూ కూడలి, హరనాథపురం సర్కిల్ ఒక్కో ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీను దృష్టిలో ఉంచుకొని సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన టైమింగ్‌ను కార్పొరేషన్ శాఖ ఇంజనీరిం గ్ విభాగం వారు సెట్ చేస్తారు.

● ఫ్లైఓవర్, అండర్‌బ్రిడ్జి మూత

నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఫ్లైఓవ ర్ మరమ్మతుల కారణంగా ఆదివారం నుంచి మూసేస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఫ్లైఓవర్‌పై జాయింట్ల వద్ద రిపేర్లు, ఇతర పనులు ఉండటంతో సుమా రు 45 రోజులపాటు మూసివేస్తున్నట్లు తెలిపారు. కార్పొరే షన్ ఇంజనీరింగ్ విభాగం, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీలు సంయుక్తంగా సమర్పించిన నివేదిక ఆధారం గా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్, ఆత్మకూరు బస్టాండు వద్ద బోసు బొమ్మకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి ఓ వైపు మూసివేయడం జరుగుతుందన్నారు. బోసుబొమ్మ నుంచి పొట్టిశ్రీరాములు బొమ్మ వైపు వచ్చే అండర్‌బ్రిడ్జిలో వాహనాల రాకలు జరుగుతాయన్నారు. ఫ్లైఓవర్ కింద మార్గాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం, కోవూ రు నుంచి వచ్చే వాహనదారులు నూతన పెన్నా వారధి పైనుంచి నగరంలోకి రావాలన్నారు. నవాబుపేట, బాలాజీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు విజయమహల్ గేటు, రామలింగాపురం అండర్ బ్రిడ్జి మార్గాలలో నగరంలోకి వెళ్లాలని కోరారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నందన్

క్రీడల్లో మే'ఘన'త'

పేదింట విరిసిన క్రీడా కుసుమం

పాఠశాల స్థాయి నుంచే ఆటల్లో దిట్ట

ఏడు ఆటల్లో సత్తా చాటుతున్న యువతి



సాధారణంగా ఒకరు ఒకటి లేదా రెండు, మహా అయితే మూడు క్రీడల్లో రాణిస్తుంటారు. కానీ ఓ అమ్మాయి ఏకంగా ఏడు క్రీడాంశాల్లో ప్రతిభ చాటుతోంది. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ క్రీడా కుసుమం ఆటలపై ఆసక్తి, నిరంతర సాధనతో వివిధ పోటీల్లో సత్తాచాటింది. అంతర్ విశ్వవిద్యాలయ పోటీలతోపాటు జాతీయ స్థాయిలో రాణిస్తున్న మే'ఘనత'ను తెలుసుకుందాం..

● వీఎస్‌యూ, ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం

● అంతర్ విశ్వవిద్యాలయ, జాతీయ పోటీల్లో రాణిస్తున్న జేబి విద్యార్థిని

కావలి (టౌన్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విడవలూరు మండలం క్రైస్తవపాలెనికి చెందిన పేద రైతు శ్రీరాములు, సుమతి దంపతుల కుమార్తె పెనమల్లి మేఘన. కావలి జవహర్ భారతి డిగ్రీ కళా శాలలో బీఎస్సీ చదువుతోంది. చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తితో పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంది. ప్రతీ పోటీలోనూ సత్తా చాటి బహుమతులు సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు రకాల క్రీడల్లో నైపు ణ్యం సాధించింది. వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, షూటింగ్ బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో తన ప్రతిభను ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలందుకుంది. క్రీడలకు పెట్టింది పేరైన కావలి జేబీ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుతోంది. నిత్యం క్రీడా సాధన, విశ్వోదయ విద్యా సంస్థ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి సహకారం, కళాశాల పీడీ ప్రసాద్ రెడ్డి శిక్షణతో రాష్ట్ర, అంతర్ విశ్వవిద్యాలయ, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తోంది.

జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం ఇలా..

- 2022లో మధ్యప్రదేశ్‌లో, 2023లో ఢిల్లీలో జరిగిన షూటింగ్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించింది.
- 2023 గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ యూత్ నేషనల్స్‌లో రాష్ట్ర తరఫున పాల్గొని జట్టు విజయాల్లో ప్రధాన భూమిక పోషించింది.
- 2024లో కర్నాటకలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో వీఎస్‌యూ జట్టు విజయానికి కృషి చేసింది.
- ఈ ఏడాది జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ సీనియర్ నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆడి అద్భుత ప్రతిభ కనబరిచింది.
- తాను నైపుణ్యం సాధించిన ఏడు క్రీడాంశాల్లో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జట్టుకు మేఘన ప్రాతినిధ్యం వహిస్తుండటం ఆమె ప్రతిభకు తార్కాణం.



ఎస్ఐ కావడమే లక్ష్యం

చిన్నప్పటి నుంచి నాకు క్రీడల్లో ఆసక్తి ఎక్కువ. ఏడు రకాల ఆటల్లో మెలకువలు నేర్చుకుని ఎన్నో బహుమతులు సాధించాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంతోపాటు పోలీస్ శాఖలో ఎస్ఐగా చేరాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నా. విశ్వోదయ సంస్థ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి సహకారం, పీడీ ప్రసాద్ రెడ్డి ప్రోత్సాహం నన్నుఈ స్థాయికి చేర్చాయి. చదువులో రాణిస్తూనే, పట్టుదలతో క్రీడల్లో మరింత సాధన చేసి లక్ష్యాన్ని చేరుకుంటాను.

- మేఘన

పురుగుల బియ్యంతో భోజనమంటూ పుకార్లు

● ఎంఈవో విచారణ ● అవాస్తవమని నిర్ధారణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం పురుగులు పట్టి నెలల తరబడి ముక్కి పోయిన బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారనే పుకార్లు శుక్రవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. దీంతో ఎంఈవో-2 రమణయ్య హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సమగ్రంగా విచారించి అలాంటి సంఘటన చోటు చేసుకోలేదని నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మిగిలిన బియ్యం పురుగులు పట్టి ఉన్న విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆ బియ్యంతో వంట చేయకుండా ఇటీవల పంపిణీ చేసిన బియ్యాన్నే వినియోగించినట్లు చెప్పారు. బియ్యం సకాలంలో సరఫరా కాకపోవడంతో సమీప తిమ్మారెడ్డిపల్లి పాఠశాల నుంచి తెప్పించారన్నారు. ప్రతీనెల 7వ తేదీ సరఫరా కావాల్సిన బియ్యం ఆలస్యమవడంతో ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోందన్నారు. అనంతరం బియ్యంతోసహా భోజనశాల, పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న బియ్యాన్ని గదిలో నుంచి తీసి వేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచు దిలీప్‌కుమార్, వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకట మోహన్ సైతం పాఠశాలకు చేరుకొని విచారించారు. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు గత వారం పురుగులున్న బియ్యంతోనే భోజనం చేశారని విన్నవించారు. అనంతరం వంటకాలను పరిశీలించి కూరలు రుచిగా లేవని నిర్ధారించారు. ఇకపై నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. గతంలో వంటలు సరిగా లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు సమీప ఆలయంలో అన్నదానంతో ఆకలి తీర్చుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భవిష్యత్తులో అలాంటివి జరుగకుండా అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కోరారు.



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రమణయ్య

ముగిసిన ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా నిరసన చేపట్టిన ఆర్ అండ్‌బీ ఉద్యోగులు శుక్రవారం తమ నిరసననువిరమించారు. ఈఎన్‌సీ, డిప్యూటీ ఈఎన్‌సీ ఆదేశాలు ఇవ్వటంతో సమస్యలు కొంత మేరకు పరిష్కారమయ్యాయని ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ అధ్యక్షుడు శరత్‌బాబు చెప్పారు. దీంతో జేఏసీ నిర్ణయం మేరకు నిరసన కార్యక్రమాన్ని ముగిస్తున్నామని ప్రకటించారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి సారించండి సారూ..

● ఏసీఆర్‌ఎంయూ ప్రధాన కార్యదర్శికి వినతి

బిట్రగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ ఇండియా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివ గోపాల్ మిశ్రాకు బిట్రగుంట బ్రాంచ్ సభ్యులు వినతిపత్రం అందచేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ కౌన్సిల్ సమావేశం పాల్గొన్న ఆయన దృష్టికి బిట్రగుంట సమస్యలు తీసుకెళ్లారు. రైల్వే కార్మికుల అవసరార్థం విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను బిట్రగుంట స్టేషన్లో నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్‌యూనియన్ బిట్రగుంట అధ్య క్షుడు ఎం.శేఖర్‌యాదవ్, కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బీ.మైకేల్, సభ్యులు శ్రీహరి, ప్రసాద్, నవీన్, మధు, రఘు పాల్గొన్నారు.



ఏసీఆర్‌ఎంయూ జనరల్ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

అధికారుల నిర్లక్ష్యం

సోమశిల ఉత్తర కాలువకు ముప్పు

నీటి విడుదల ప్రశ్నార్థకం



కలిగిరి మండలం వెలగపాడు వద్ద సోమశిల ఉత్తరకాలువ బ్రాంచి కెనాల్‌కు పడిన గండి

సోమశిల అధికారుల నిర్లక్ష్యం కారణంగా సోమశిల ఉత్తర కాలువకు ముప్పు పొంచిఉంది. మొంథా తుఫాన్‌కు ఈ కాలువకు మూడు గండ్లు పడినా వాటిని పూడ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. కాలువ నీరు కిందకు పోకుండా దంటుపాలెం వద్ద బిగించి ఉన్న గేట్లను తుఫాన్ సమయంలో అధికారులు ఎత్తకపోవటంతో ఆ నీరు ముందుకు పోయేందుకు మార్గం లేక కాలువ గట్లు పొంగి ప్రవహించి గండ్లు పడటానికి కారణమైంది. అయితే గండ్లు పడిన తర్వాత కూడా అధికారులు మేల్కొని వాటిని పూడ్చకపోవటంతో ఈనెల 15వ తేదీ నుంచి సోమశిల కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు డీఆర్సీ మీటింగ్‌లో అధికారులు ప్రకటించినా నీరు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. వరి నారుమడులు పోసుకునేందుకు సిద్ధమవుతున్న రైతులు సోమశిల నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కలిగిరి శివారులో ఉన్న ఉత్తరకాలువ (గొట్టిపాటి కొండపనాయుడు) కాలువ నుంచి సబ్‌చానల్ ద్వారా మార్గమధ్యంలో అనేక గ్రామాలను కలుపుకుంటూ ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామం చెరవు వరకు సోమశిల నీరు వెళుతోంది. గత వ్యవసాయ సీజన్‌లో కలిగిరి మండలం కావలి ముస్తాపురం పంచాయతీ దంటుపాలెం గ్రామం వద్ద పైనున్న తూమును కట్టేసి నీటిని జమ్మవరం వైపు పంపారు. అయితే రైతుల అవసరాలు తీరిన తర్వాత ఆ తూము గేట్లు ఎత్తకపోవడంతో నీరు ముందుకు వెళ్లేందుకు మార్గం లేక మొంథా తుఫాన్‌కు కాలువ మూడు చోట్ల గండ్లు పడింది. వాటిని పూడ్చని నేపథ్యంలో ఉత్తర కాలువలకు ఎలా నీటిని విడుదల చేస్తారో వేసి చూడాల్సిందే.

- కావలి (ఆంధ్రజ్యోతి)



కావలి ముస్తాపురం వద్ద సోమశిల ఉత్తరకాలువ బ్రాంచి కెనాల్‌కు గండి



కలిగిరి మండలం కమ్మవారిపాలెం వద్ద బ్రాంచి కాలువకు పడిన గండి



ఉత్తరకాలువలో నీరు కిందకు పోకుండా దంటుపాలెం వద్ద వేసిన లాక్‌లు

మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్ధంగా నిర్వహించాలి

● రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు ఆదేశం

● కందుకూరు, గుడ్లూరు మండలాల్లోని పలు పాఠశాలల్లో తనిఖీలు

కందుకూరు/గుడ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి లోటుపాట్లుకు ఆస్కారం ఇవ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బీ. కాంతారావు సూచించారు. శుక్రవారం ఆయన కందుకూరు, గుడ్లూరు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కందుకూరు మండలంలోని మాచవరం జడ్పీ హైస్కూల్, పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, పామూరు రోడ్డులో ఉన్న కేజీబీవీలో ఆయన తనిఖీలు నిర్వహించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి ప్రతిరోజు భోజన ఏర్పాట్లు జరుగుతున్న తీరు, మెనూ అమలు తదితర అంశాలను ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. అలాగే గుడ్లూరు మండలంలోని పోట్లూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని, గుడ్లూరు హైస్కూల్, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుడ్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనుప్రకారం భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. సిద్ధం చేసిన టమోటా జ్యూస్‌ను చూసి దేనికని ప్రశ్నించగా కుకింగ్ ఏజెంట్ రమణమ్మ 10 కేజీల టమాటాలతో కోడిగుడ్ల కూర చేస్తున్నామని చెప్పడంతో ఆయన దానిని సిబ్బంది ద్వారా కాటావేయించారు. అది 8 కేజీలు ఉండడంతో మిగతా 2 కేజీల ఎక్కడని ప్రశ్నించారు. ఇలా చేయడం జరికాదని, విద్యార్థులను తమ ఇంట్లో పిల్లలుగా భావించి భోజనం వండిపెట్టాలని సూచించారు. కాగా గుడ్లూరు రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరగడంలేదని కొందరు గ్రామస్థులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రతి నెల బియ్యం ఇస్తున్నా, చక్కెర, కందిపప్పు, ఇతర పప్పుధాన్యాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోయినా, మెనూ అమలు చేయకపోయినా, రుచిగా శుచిగా లేక పోయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్‌వో లీలారాణి, డీఎం అర్జున రావు, సమన్వయ అధికారి సైమన్‌బాబు, స్థానిక విద్యాశాఖ అధికారులు ఉన్నారు.



కందుకూరు జడ్పీ పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న కాంతారావు

చేజర్లలో బీజేపీ నేతల సంబరాలు

చేజర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మండల బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డెరెక్టర్ బత్తల క్రిష్టయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేజర్ల బస్టాండు సముదాయంలో బాణాసంచా పేల్చి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి, శివారెడ్డి, కోటేశ్వరరెడ్డి, పెంచలయ్య, కాలేషా, హజరత్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11985
వెండి కిలో ధర	రూ. 164500
వెండి ఒక గ్రాము	రూ. 170.50

న్యూస్ బాక్స్

ఆంజనేయస్వామికి అభిషేకాలు



ఆలయ వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరపనాయుడు కండ్రికలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నూతన ఆలయంలో పూజల ప్రారంభం

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెంలో ఇటీవల దాతల సహకారంతో నిర్మించిన విజయ గణపతి, నాగేంద్రస్వామి, మహాలక్ష్మమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, హోమం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. శనివారం విగ్రహాల గ్రామోత్సవం, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి దంపతులు బాలకృష్ణారెడ్డి, పద్మవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అనిత

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఛాంపియన్ రైతులకు శుక్రవారం ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్న గ్రామానికి ఒక రైతు చొప్పున ఛాంపియన్ రైతులుగా గుర్తించి వారికి సాగులో ఆధునిక పద్ధతులపై ఏడీఏ అనిత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్, విఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగాని పల్లి పంచాయతీ బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దాతలు ప్లేట్లు పంపిణీ చేశారు. పంచాయతీలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లూరి రవీంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డిలు 150 భోజన ప్లేట్లను ప్రధానోపాధ్యాయులు మాధవరావుకు అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

అనంతసాగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల ఫీజును శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డికి అందజేశారు. 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 125ల చొప్పున అందజేశారు.

రావిళ్లవారిపాళెంలో గ్రామసభ

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుకొల్లు పంచాయతీ రావిళ్లవారి పాళెంలో శుక్రవారం స్వామిత్వ ప్రత్యేక గ్రామసభను ఎంపీడీవో చెంచమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో గ్రామకంఠం గుర్తించడంతోపాటు నివాసాల కొలతలు సేకరించి ప్రజల వద్ద నుంచి అభ్యంతరాలు స్వీకరించారు.

వాడవాడలా బాలల దినోత్సవం

చాచా నెహ్రూకు ఘన నివాళి



ఆత్మకూరు : నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు



సంగం: నెహ్రూ గురించి విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు



సీతారామపురం ఎంపీపీ స్పెషల్ స్కూల్లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు సుధాకర్‌రావు, శ్రీరాములు, బి శ్రీనివాసులు, కృష్ణమాచారి, సాదిక్‌హుస్సేన్, లక్కు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ఆదిశేషయ్య చిన్నపిల్లల వైద్యశాలలో విశ్రాంత ఉద్యోగులు ఎస్‌వి రమణయ్య, నారాయణరావు, పెద్దఅంకయ్య తదితరులు చిన్నారులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెటు పంపిణీ చేశారు.

●**సంగం :** మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని కృష్ణంపల్లి, వెంకట్రావుపల్లి, బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

●**సీతారామపురం:** స్థానిక ఎంపీపీ స్పెషల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణామరాజు, ఉపాధ్యాయులు గోసుల వెంకటేశ్వర్లు, కలివెల రవిచంద్ర, ఖాజారంతుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల చేత కేక్ కట్ చేయించి స్వీట్స్ పంచిపెట్టారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

●**ఏఎస్ పేట :** స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవం ఎంఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఆదేవిధంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించి చాచా నెహ్రూకు నివాళులు అర్పించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ఆత్మకూరు : సరస్వతిదేవి, నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న లైబ్రేరియన్

ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అపస్మా గౌరవాధ్యక్షుడు టిసివి సుబ్బయ్య, విశ్రాంత గ్రంథపాలకుడు ఏ గోవిందరెడ్డి, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, విద్యార్థులు సరస్వతిదేవి, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రారంభించారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేసి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. పుస్తకపఠనంతో మేధోశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రుక్మిణి సూచించారు. శుక్రవారం ఆమె గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయంలోని పుస్తకాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కళాశాలలోని గ్రంథాలయంలో ఎన్నోరకాల విజ్ఞానకరమైన పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్, గ్రంథాలయ ఇన్‌చార్జి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

తలుపులు తెరుచుకోని సంగం గ్రంథాలయం



తలుపులు తెరుచుకోని సంగం శాఖా గ్రంథాలయం

సంగం: జిల్లావ్యాప్తంగా శుక్రవారం గ్రంథాలయాల వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభంకాగా సంగం శాఖా గ్రంథాలయం తలుపులు తెరుచుకోలేదు. ఇక్కడ పనిచేస్తున్న లైబ్రేరియన్ మూడు నెలల కిందట పదవీ విరమణ చేశారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో పని చేస్తున్న లైబ్రేరియన్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. శుక్రవారం ఆయన రాకపోవడంతో తలుపులు తెరుచుకోలేదు.

నేడు ఆయకట్టు రైతుల సమావేశం

ఉదయగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం పరిధిలోని ఆయకట్టు రైతుల సమావేశం శనివారం జలాశయ ఆవరణలో నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జలాశయ కమిటీ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జలాశయం నుంచి నీరు విడుదుచేసే తేదీని ప్రకటించడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశానికి ప్రాజెక్టు కమిటీ సభ్యులు, డిస్ట్రిబ్యూటరీ సాగునీటి సంఘాధ్యక్షులు, సభ్యులు, రైతులు తదితరులు హాజరై తగు సూచనలు, సలహాలు అందజేయాలని ఆయన కోరారు.

రిజర్వాయర్ అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ మధుసూదనరావు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నక్కలగండి రిజర్వాయర్ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం తమవంతు కృషిచేస్తానని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం భోగ్యంవారిపల్లిలో చైర్మన్ వేమూరి మధు ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లోకి పూర్తిస్థాయిలో వరద నీరు చేరిందన్నారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి నీటి విడుదలలో లోపాయికారి రాజకీయాలకు తావులేకుండా చూడాలన్నారు. రిజర్వాయర్ పరిధిలోని తూములు, ఆరు కాలువలను మరమ్మతులు చేయాల్సి ఉండగా ప్రస్తుతం నీటిని విడుదల చేస్తే వృథా అయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటికి సంబంధించి సమగ్రంగా నివేదికలను రూపొందించాలని సూచించారు. అవసరమైతే శాసనసభ్యుడు కాకర్ల సురేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. డెరెక్టర్లు గ్రామాల్లోని నాయకులు, రైతులకు రిజర్వాయర్ పరిస్థితిపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేశ్వరరావు, కూటమి నాయకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు, లాబాన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న సంఘ ఉద్యోగులు

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘ ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ పనిగంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలన్నారు. స్త్రీశక్తి పథకంలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ పథకం ద్వారా సంస్థలో అన్నివర్గాల ఉద్యోగులపై పనిభారం పడి మానసిక వత్తిడికి గురవుతున్నారన్నారు. వెంటనే కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, నూతన నియామకాలు చేపట్టాలని, అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, జామవా, సురేష్, మనోహర్, మల్లికార్జున, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు దూరం : ఎస్ఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారు ప్రాంతంలోని 167-బీజీ జాతీయ రహదారి గండిపాళెం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు లైసెన్సు కలిగి ఉండడంతోపాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కనిగిరి కాలువ క్రాస్ రెగ్యులేటర్ మరమ్మతు పనులు

- నేడు నీటి విడుదల సందేహమే..
- ముదిరిపోతున్న నారుమళ్లు
- ఆవేదనలో రైతులు



షట్టర్ల మోటార్లపై వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులు

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్ల మరమ్మతు పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పనులు పూర్తయితేగానీ బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి. పనులు పూర్తికావాలంటే మరో వారం.. పది రోజులు పట్టే అవకాశం ఉంది. ఐఏబీ సమావేశం నిర్ణయం మేరకు శనివారం నుంచి బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి. కానీ పనులు కొనసాగుతుండడంతో కాలువకు నీటి విడుదలపై రైతుల్లో సందేహం వ్యక్తమవుతోంది. ఈ కాలువ కింద ఆత్మకూరు, కోవూరు, ఉదయగిరి, కావలి నాలుగు నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు ఉంది.

దెబ్బతిన్న క్రాస్ రెగ్యులేటర్లు

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రాస్ రెగ్యులేటర్లకు కనీసం తారు కూడా వేయని పరిస్థితి. దీంతో ఎప్పుడూ నీటిలో ఉండే భారీ క్రాస్ రెగ్యులేటర్లు తుప్పుపట్టి దెబ్బతిన్నాయి. అందులో ఒకటి కిందకు, పైగి దిగకుండా స్ట్రక్ అయిపోయింది. మోటార్లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మరమ్మతులు చేయనిదే కాలువకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రాస్ రెగ్యులేటర్ల మరమ్మతుల కోసం రూ. 65 లక్షల నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఖరీఫ్ సీజన్ ముగియగానే పనులు ప్రారంభించలేదు. ఆలస్యంగా అక్టోబరు 10 తేదీన పనులు ప్రారంభించారు. ఈలోపు మొంథా తుపాన్ రావడంతో మరమ్మతు పనులు ఆగిపోయాయి. దీంతో పనుల్లో జాప్యమయ్యాయి.

ఐఏబీ సమావేశంతో పనుల ప్రారంభం

ఈనెల 7వ తేదీన మంత్రుల ఆధ్వర్యంలో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి 15వ తేదీ నుంచి డెల్టాలోని అన్ని కాలువలకు నీటిని విడుదల చేస్తామని ప్రకటించడంతో సెక్షన్ అధికారుల్లో చలనం వచ్చింది. ఆగమేఘాల మీద కాంట్రాక్టర్‌చే మరమ్మతు పనులు ప్రారంభించారు. మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 50 శాతం పనులు మాత్రమే అయ్యాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు నత్తనడకన జరుగుతున్నాయి.

ముదురుతున్న నారుమళ్లు

బెజవాడ పాపిరెడ్డి కాలువకు నీటిని విడుదల చేసిన వెంటనే వరినాట్లు వేసుకోవచ్చుననే ఉద్దేశంతో మోటార్ల కింద రైతులు నారుమళ్లు వేశారు. ఐఏబీ సమావేశంలో 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేస్తామని ప్రకటించడంతో సంబరపడ్డారు. కానీ మరమ్మతు పనులు నత్తనడకన జరుగుతుండడం, నీటి విడుదల మరో వారం, పది రోజులు జాప్యం అయ్యే అవకాశం ఉండడంతో వేసిన నారుమళ్లు ముదిరిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తిచేసి కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అపరాధ రుసుం వసూలు

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిదిమందిని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే. వెంకటరెడ్డి శుక్రవారం ఒకటవ అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి భరద్వాజ్ ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఎనిమిది మందికి రూ. 80 వేలు అపరాధ రుసుం విధించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం వద్ద రైలు పట్టాలపై ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు, వెంకటేశ్వరపురం శివాలయంవీధికి చెందిన డీ. మాలకొండయ్య (50) అనారోగ్య సమస్యలతో శుక్రవారం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి, కేసు నమోదు చేశారు.

రామాలయంలో చోరీ



చోరీ జరిగిన రామాలయం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదేవులపాడు రామాలయంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. గురువారం రోజువారీ పూజలు నిర్వహించిన స్థానికులు తాళాలు వేసి నివాసాలకు చేరుకున్నారు. అనంతరం గుర్తు తెలియని దుండగులు తలుపులకు వేసిన తాళాలు పగులకొట్టి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రాలను చోరీ చేసి పరారయ్యారు. ఉదయాన్నే అటుగా వెళ్ళిన కొంతమంది ఆలయం తాళాలు పగులకొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూసి సుమారు రూ. 50వేలు విలువ కలిగిన నాలుగు మంగళ సూత్రాలు చోరీ అయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ ముప్పసాని బాబు

చేజర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఏటూరు కండ్రిక గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. పూర్తి వివరాల మేరకు.. నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన ముప్పసాని బాబు పొదలకూరు మండలంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి బైక్‌పై వస్తుండగా ఏటూరు కండ్రిక గ్రామ సమీపంలో ఒక్కసారిగా గేదెలు రోడ్డుపైకి రావడంతో అదుపుతప్పి బైక్‌పైనుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన ముప్పసాని బాబును అటుగా వస్తున్న ప్రయాణికులు గమనించి 108 ద్వారా పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసుల దాడి

● 28 మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించినట్లు కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని క్రాకుటూరులో బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంపై దాడులు చేసి 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీహరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. దీంతో సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు జరుగుతుంటే 9440902523కు సమాచారమివ్వాలన్నారు. ఈ మండలాల్లో గత 15 రోజుల్లో 28 కేసులు నమోదు చేసి 500 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సుమారు 50 మందిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేయించామన్నారు. బెల్టు దుకాణాల్లో మద్యాన్ని కల్తీ చేసే అవకాశం ఉంటుంది కాబట్టి వాటి నిర్మూలన కోసం ఈ దాడులు నిర్వహిస్తున్నామన్నారు.

సీసీఆర్‌సీలు అందేనా..!?

(5వ పేజీ తరువాయి)

సుమారుగా 20,451 వరకు కార్డులు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో ఇప్పటి వరకు లక్ష్యాలకు మించి సీసీఆర్‌సీలు అందజేశారు. ఇంకా కొన్ని మండలాల్లో లక్ష్యాలకు అనుగుణంగా అందచేయలేదు. అవగాహనలేమితో చాలా మంది రైతులు వీటిని అందుకోలేకపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూశాఖల సమన్వయంతో అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కౌలుకు భూమి ఇచ్చినట్లు అంగీకారపత్రం ఇవ్వడంవల్ల భూయజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అర్హత కలిగిన రైతులందరికీ సీసీఆర్‌సీ ఇప్పించడంతోపాటు వారికి రుణాలందేలా బ్యాంకర్లతో మాట్లాడుతు న్నాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ఇంటర్ పరీక్షల్లో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు రాసిన విద్యార్థులకు సెకండ్ ఇయర్‌లో కూడా ఇదే కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే ప్రశ్నపత్రాలుంటాయి.

● **ఫస్ట్ ఇయర్‌లో 27వేల మంది**

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది 187 కళాశాలల నుంచి 27వేల మంది విద్యార్థులు కొత్త విధానంలో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు. ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒరియంటల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధన జరుగుతోందని తెలిపారు.

నర్సరీ, ప్లాంటేషన్ల పరిశీలన

ఉదయగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి రేంజ్ పరిధిలోని నర్సరీ, ప్లాంటేషన్లను శుక్రవారం జిల్లా అటవీ శాఖాధికారి కె మహబూబ్‌బాషా, సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉదయగిరి మండలంలోని దుర్గంపల్లి నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం చేపట్టి సకాలంలో నీటి తడులు అందించాలన్నారు. అలాగే దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో ఉన్న ప్లాంటేషన్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఎఫ్‌బీవో లక్ష్మీప్రసన్న, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 600

బాలల హక్కులపై అవగాహన

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు పోకూరి కోటయ్య, సంపత్‌కుమార్, ముప్పవరపు కిషోర్‌లు మాట్లాడుతూ బాలల హక్కుల గురించి, బాల బాలికలకు భారతరాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవిజ్ఞాన సదస్సులో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు, హెచ్ఎం

నీటి గుంటలు అన్యాక్రాంతం!

● చెంచుగానిపాలెంలో 150 ఏళ్ల చరిత్ర కనుమరుగు ● ఒక్కో గుంట స్థలం విలువ రూ.30-50 లక్షలు ● పట్టించుకోని అధికారులు


రామాలయం ఎదురుగా ఆక్రమణలతో కుంచించుకుపోయిన గుంట

కావలిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగానిపాలెంలో 150 ఏళ్ల చరిత్ర కలిగి పచ్చటి పైరులు, పక్షుల కిలకిలరాగాలతో ఊరు చుట్టూ ఆహ్లాదకరమైన నీటి గుంటలు అన్యాక్రాంతమయ్యాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రామంలో సుమారు 400 కుటుంబాలు నివశిస్తున్నారు. ఈ గ్రామం చుట్టూ పూర్వం బ్రాహ్మణులు నాలుగు గుంటలు తవ్వించి ఆ గుంటల నిండా చెరువు, వర్షాల నీటి నింపేవారు. ఆ గుంటల్లో మొలచే నీలి ఆకులను పెంచేవారని, వాటికి అనుసంధానంగా బొంతరాయి తొట్టెలు ఏర్పాటు చేసుకుని వాటిలో నీలి ఆకులు నానబెట్టి ఆయుర్వేద మందు తయారు చేసిన తరువాత ఆ నీటిని మళ్లీ గుంటలకు వదిలేవారని గ్రామస్థులు చెబుతున్నారు. మందు తయారు చేసి గ్రామ ప్రజలకు వివిధ రోగాలకు అందజేసేవారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంతటి చరిత్ర కలిగిన బొంతరాయి తొట్టెలను 15 ఏళ్ల క్రితం ధ్వంసం చేసి గుంటల ఆక్రమణకు గ్రామంలోని కొందరు శ్రీకారం చుట్టారు. సుమారు 30 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణం లో ఉన్న గుంటలు గ్రామంలో నివాసాలకు ఆనుకుని ఉన్నాయి. అక్కడ ఒక సెంటు ధర రూ.లక్ష పలుకుతుండడంతో ఒక్కో గుంట విలువ సుమారు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతోంది. దీంతో ఆ గుంటలపై ఆక్రమణదారుల కన్ను పడింది. గ్రామంలోని రాములవారి గుడి ముందు ఉన్న గుంటతో పాటు ఓ వ్యక్తి పొలం పక్కన ఉన్న గుంటను చుట్టుపక్కల పొలాల వారు ఆక్రమించారు. ఇక గ్రామంలో నివాసాల మధ్యన ఉన్న గుంటను గత వైసీపీ ప్రభుత్వంలో వైద్యశాల, గ్రామ అవసరాల కోసం అంటూ ఉపాధిహామీ నిధులతో గుంటను పూడ్చివేశారు. ఇప్పుడు అదికూడా గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లడంతో దొంగ పట్టాలు సృష్టించి ఆ స్థలం కొట్టేసే ప్రయత్నం


గ్రామ అవసరాల పేరుతో పూడ్చిన గుంట స్థలం


ఇటీవల ఓ పార్టీ నేత మట్టి తోలి పూడ్చివేసిన గుంట

చేస్తున్నారు. మరో గుంట రోడ్డుకు ఆనుకుని ఉండడం, ఆ ప్రాంతంలో భూముల ధరకు రెక్కలు రావడంతో ఇటీవల ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఆ గుంటను ఆక్రమించి మట్టితోలించి అమ్మకానికి పెట్టాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ఆక్రమణల చెరలో ఉన్న గుంటల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

గ్రామానికి సమీపంలో, గ్రామంలో నీటి గుంటలు ఆక్రమిస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. గుంటలకు సంబంధించిన స్థలాలను, గుంటలను పరిశీలిస్తాం. అవి ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారణకు వస్తే తదుపరి చర్యలు చేపడతాం.

- శ్రావణ్ కుమార్, తహసీల్దారు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


కావలి ఆర్టీసీ డిపోవద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



కందుకూరు ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల ధర్నా

కావలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కావలి ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిపో మేనేజరు ఆదినారాయణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ కావలి కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సిబ్బంది నియామకాలను చేపట్టాలని, 1/2029 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. మహిళా ప్రయాణికులకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని, సిబ్బందిపై ఎవరైనా దాడిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతల ప్రకియను త్వరగా పూర్తి చేయాలని, ఆర్టీసీ రూట్లలో ప్రయివేట్ ట్రావెల్స్ అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. బస్సు స్టేషన్ల ప్రయివేటీకరణ విధానాలను మానుకోవాలని, విద్యుత్‌బస్సుల నిర్వహణ ఆర్టీసీలకే ఇవ్వాలని, అక్రమ సస్పెన్షన్లను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పీ.పెంచలయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రోశయ్య, మధు, కుమార్, అబ్దుల్‌కరీమ్, రాంబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు డిపో గ్యారేజీ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికసంఘం నాయకులు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, మహిళలకు స్మార్ట్‌కార్డులు ఇవ్వాలన్నారు. స్త్రీశక్తి పథకం కారణంగా 50మంది ఎక్కాల్సిన బస్సులో ఒక్కోసారి 150మంది ఎక్కుతున్నారని, అలాంటప్పుడు టికెట్లు కొట్టడంలో జరిగే చిన్న చిన్న పొరపాట్లుకు తమను బలిచేయకుండా చూడాలని కోరారు. కార్మికుల పనిభారాన్ని తగ్గించేందుకు కొత్త ఉద్యోగుల నియామకం చేపట్టాలని, డిపోలో మహిళా ఉద్యోగులకు కనీసం సౌకర్యవంతమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీ.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేఎస్ రావు, కె.నీరజ, డి.మాలకొండయ్య, ఎస్కే బాషా, ఎస్.మహేంద్ర, బీవీ.సుజాత, బాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు

● జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందని, పంట సాగు లాభసాటిగా ఉన్నందున రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని కొండముడుసుపాలెం రైతుసేవాకేంద్రంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మొక్క నాటింది మొదలు పంట చేతికొచ్చేవరకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, వివిధ దశల్లో హెక్టారుకు మొత్తం రూ.71వేల రాయితీగా అందజేస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు అధిక దిగుబడులను ఇవ్వటంతో పాటు మార్కెటింగ్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది లేనందున రైతులు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానఅధికారి బీ.జ్యోతి, ఆయిల్‌పామ్ సీడ్ కంపెనీ ఎండీ హరీష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానఅధికారి సుబ్బారెడ్డి

మత్తుకు బానిసైతే.. జీవితాలు చిత్తే !

కావలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసలైతే యువత జీవితాలు చిత్తేనని ఇస్కపల్లి మెరైన్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఒట్టూరు మోడల్ స్కూల్‌లో శుక్రవారం కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే యువత భవితకు బంగారు బాటలు వెయ్యటం జరుగుతుందని, ప్రతి ఒక్కరు చక్కగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. చిన్నతనంలో మత్తుకు అలవాటు పడితే జీవితాంతం మత్తుకు బానిసలుగా బతుకుతూ సమాజం లో చీదరింపులకు గురవుతారన్నారు. ఎక్కడైనా గంజాయి, మత్తుపదార్థాలు అమ్ముతున్నట్లయితే 1072 నెంబరుకు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిషోర్‌బాబు, జానకిరామయ్య, ప్రిన్సిపాల్ ఇందిర పాల్గొన్నారు.

● **హెల్మెట్ తప్పనిసరి**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ముసునూరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్ఐ బాజీబాబు, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్ పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో డిసెంబరు 18 నుంచి సదస్సు

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 18, 19వ తేదీలలో అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వెబినార్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అధ్యాపకులతో కలిసి ఆయన మాట్లాడుతూ భాష - సాహిత్యము, రాజకీయ రంగాలలో నూతన ధోరణులు - విశ్లేషణ అనే అంశాలపై నిర్వహిస్తున్న వెబినార్‌లో తెలుగు, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్ విభాగాలకు చెందిన అధ్యాపకులు పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చునని తెలిపారు.

ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్‌పై అవగాహన

ఉలవపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి వాహనాలను నడిపి ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఉలవపాడు పోలీసులు శుక్రవారం ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఎస్ఐ అంకమ్మ, పోలీసు సిబ్బంది స్థానికులతో కలిసి గ్రామంలోని వీధుల్లో హెల్మెట్ ధరించి బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న వారికి గులాబీ పుష్పాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అదేవిధంగా కారులో వెళుతున్న ప్రయాణికులకు సీటు బెల్టుపై అవగాహన కల్పించి గులాబీ పుష్పాలను అందించారు. హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఆయన సూచించారు.


వాహనదారులతో కలసి హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ అంకమ్మ, పోలీస్ సిబ్బంది

అట్టహాసంగా బాలల దినోత్సవం

కావలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం బాలల దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తలసేమియా డేకేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు పాల్గొన్నారు. జూనియర్ రెడ్‌క్రాస్ అడ్వయిజర్ బెజవాడ ప్రసన్నకుమార్, కన్వీనర్లు గాదిరెడ్డి హరినాథ్, పీ.సాయికుమార్‌లు చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, డాక్టర్ షాజియా, కే.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● **కావలిరూరల్** : కావలి మండలంలోని సర్వాయిపాలెం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్, కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్ తదితర ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడులకు నిర్వహించారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో 1,2 రవికుమార్, ఆనందరావులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిపేట దామా చిన బాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామమోహన్‌రావు జవహర్‌లాల్ నెహ్రూ గురించి వివరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

● **కందుకూరు** : బాలల దినోత్సవాన్ని పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో బాలబాలికల నృత్యప్రదర్శనలు, ఆటపాటలతో అలరించారు. పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల పూర్వవిద్యార్థి సుబ్బారెడ్డి పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఈవో నాగకుమార శర్మ, హెచ్ఎం సుధాకరరావు, స్కూల్‌కాంప్లెక్స్ చైర్మన్ షౌకతుల్లా, స్కూల్‌కమిటీ చైర్మన్ వేముల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కావలి : రెడ్‌క్రాస్‌లో నెహ్రూకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

● **ఉలవపాడు** : పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు చిన్నారులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● **వలేటివారిపాలెం** : మండలంలోని బడేవారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాచానెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు దేశనాయకుల విషధారణలో అలరించారు. పాఠశాల హెచ్ఎం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

అల్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలోని బీఎంఆర్ గిరిజన కాలనీవాసులకు ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచు పాటి రంజిత్ కుమార్, సీనియర్ నాయకులు పాపనబోయిన జగన్మోహన్‌రావులు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, స్థానిక నాయకులు మక్కి గోపాల్, వీఆర్వో మల్లికార్జున, ఏఆర్‌డీ సిబ్బంది ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో గ్రంథాలయ వారోత్సవాలు

బిట్రగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బోగోలులో 58వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవం నిర్వాహకులు బీ.శశి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.హెప్సిబాం ముఖ్య అతిథిగా హాజరై జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ జన విజ్ఞానానికి ఆలయం వంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాని తెలిపారు. వాటర్‌ట్యాంకులు క్లోరినేషన్ చేయించాని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

లింగసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లను నాణ్యతగా నిర్మించాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం మండలంలోని విశ్వనాథపురం, వీఆర్‌కోట గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలని, రైతులను ఉద్యాన పంటలను సాగుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వర్మీ కంపోస్టు పిట్‌లు, ఫారం పాండ్లు లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్‌బాషా, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఆర్'లో వైజ్ఞానిక ఉత్సవ్

కావలిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరవరంలో ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం వైజ్ఞానిక ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆర్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూములను కాపాడండి


భూమిని పరిశీలిస్తున్న వీఆర్వో

కలిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పెదకొండూరు రెవెన్యూ పరిధిలోని మేతపోరంబోకు భూములను పలువురు ఆక్రమించుకొని సాగుచేయడానికి ప్రయత్నిస్తున్నారని వారినుంచి ఆ భూములను కాపాడాలని మాజీ సర్పంచు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మొక్కా హజరత్ బాబు శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పశువుల మేతకోసం బీడుగా ఉన్నవాటిని ఎవరూ ఆక్రమించరాదని, గతేడాది రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ బోర్డులను తీసేసి సాగుకు సన్నాహాలు చేయడం జరిగిందన్నారు. దీంతో వీఆర్వో పెంచలయ్య సంబంధిత భూములకు వద్దకు వెళ్లి పరిశీలించారు. నివేదికను తహసీల్దారు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ మాలకొండయ్య, హజరత్‌బాబు పాల్గొన్నారు.

15 రోజుల్లో కట్టడాలు తొలగించాలి

● ఆక్రమణదారులకు నోటీసులు


నోటీసు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కలిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణలో భాగంగా కలిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి గ్రామ కంఠం భూములను ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టినవారు 15 రోజుల్లోగా మార్కింగ్ చేసిన వరకు స్వచ్ఛందంగా కట్టడాలు తొలగించుకొని ప్రభుత్వానికి సహకరించాలని తహసీల్దారు మొలతాటి గిరీష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కలిగిరి రెవెన్యూ గ్రామ కంఠం సర్వే నెంబర్లు 775/1, 775/2లలో రహదారి వెంబడి భూములు 29.43 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ఆక్రమణలో ఉన్న మొత్తం 124 మందికి ఐదు టీములుగా 10 మంది రెవెన్యూ సిబ్బంది ఈ నోటీసులు అందజేశారన్నారు. రహదారుల నిర్మాణ ఆవశ్యకత దృష్ట్యా పట్టణంలో రోడ్డు మధ్య నుంచి 50 అడుగులు వంతున రెండు వైపులా ఇటీవల మార్కింగ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్‌లో ఎన్డీఏ కూటమి విజయంపై సంబరాలు


సంబరాల్లో కావలి బీజేపీ నేతలు

కావలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో కావలిలో బీజేపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ట్రంకు రోడ్డులోని శివాజీ సెంటర్‌లో బీజేపీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన సాధ్యమని దేశ ప్రజలు విశ్వశిస్తున్నారనేందుకు బిహార్ ఫలితాలు నిదర్శనమన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం సేవలందిస్తున్న నితీశ్‌కుమార్ పట్ల ఆ రాష్ట్ర ప్రజలకు ఉన్న అభిమానం చెక్కు చెదరలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు అంచిపాకుల కమల, కుట్టుబోయిన బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, బీ.మాల్యాద్రి, పాతపాటి రమణారెడ్డి, నరేంద్ర, మాధవరావు, మురళీ, సుజి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి రూ.25వేల విరాళం

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో అనివేటి మండపం నిర్మాణం కోసం పట్టణానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, పద్మజ దంపతులు వారి కుమారుడు వేణుగోపాల్, సత్యవతి దంపతులు శుక్రవారం రూ.25,116 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, టెలికాంబోర్డు మెంబరు గుర్రం మాల్యాద్రి, చక్కా కేశవ, దాత వెంకటేశ్వర్లు మనవళ్లు వెంకటసాయిదత్తమోక్షిత్, వెంకటసాయిదత్త జితేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి శుక్రవారం సాయంత్రం జరిగిన అభిషేకం, పల్లకిసేవలోను వీరు పాల్గొని పూజలు నిర్వహించారు.

హత్య కోణంలో దర్యాప్తు చేయాలి : భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి కేసులో కీలక వ్యక్తి అయిన మాజీ టీటీడీ ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్ మరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం హత్య కోణంలో దర్యాప్తు చేయాలని టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం వీడియో ప్రకటన విడుదల చేశారు. మృతదేహం రైల్వేట్రాక్‌పై కనిపించడంపట్ల అనుమానం వ్యక్తం చేశారు. గొడ్డలి పోటును గుండెపోటుగా మలిచిన వ్యక్తులు ఏమైనా చెయ్యగలరని అన్నారు. మిగతా సాక్షులుకూడా భయభ్రాంతులకు గురౌతున్నారని, వారందిరికీ పోలీసు భద్రత కల్పించాలని కోరారు.

హత్య అయ్యుండచ్చు: హరిప్రసాద్

తిరుపతి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో కీలక సమాచారాన్ని సీఐడీకి అందించిన అధికారి మృతి యాదృచ్ఛికం కాదని జనసేన ఉమడి జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'విచారణాధికారులకు ఇప్పటికే ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చారు. మరోసారి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు రావలసివుండగా ఈ ఘటన జరిగింది. హత్య అయ్యిండే అవకాశాలు కనిపిస్తున్నాయి' అన్నారు. ఈ కేసులో మరొక రవికుమార్ ప్రాణాలకు కూడా ప్రమాదం ఉందని హెచ్చరించారు. అతనిని పోలీసులు కస్టడీలో సురక్షితంగా ఉంచాలన్నారు.

సాక్ష్యాలను తారుమారు చేసేందుకే..: రవినాయుడు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ హత్య జరిగిందని, ఇది వైసీపీ పనేనని శాప్ ఛైర్మన్ రవినాయుడు శుక్రవారం అన్నారు. బాబాయి గొడ్డలిపోటు రహస్యాలు తెలిసిన ఒక్కొక్కరి కథ ఎలా ముగిసిందో పరకామణి కేసులో కూడా అదే చేస్తున్నారన్నారు. వంద శాతం నేరాన్ని జీరో సాక్ష్యం లేకుండా చేయడం వైసీపీ డీఎన్ఏలో ఉందన్నారు. వాస్తవాలను సమాధి చేసేందుకు వైసీపీ నేతలు ఇలాంటి చర్యలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు.

రవికుమార్‌కు ప్రాణహాని వుంది: కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి నిందితుడు రవికుమార్‌కు ప్రాణహాని ఉందని తిరుపతి జనసేన సీనియర్ నేత కిరణ్‌రాయల్ ఆరోపించారు. వెంటనే అతనిని పోలీస్ కస్టడీకి తీసుకోవాలని కోరారు. సతీష్‌కుమార్‌ది ఆత్మహత్య, హత్యా అనేది తెలియాల్సివుందన్నారు. పరకామణి కేసులో వీరిద్దరే కీలకమన్నారు. రవికుమార్‌ను 2తేదీ వరకు పోలీసు అదుపులో ఉంచితే విసయాలన్నీ బయటపడుతాయన్నారు.

నా పేరు చెప్పమని బెదిరించడంతో ఆత్మహత్య: భూమన

తిరుపతి(జీవకోన), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విచారణలో భయపెట్టి, బెదిరించిన కారణంగానే పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని టీటీడీ మాజీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, సతీష్‌కుమార్‌చేత బలవంతంగా తన పేరును చెప్పించాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ తప్పులు ఎత్తి చూపుతున్న కారణంగానే ఈ కేసులో తనను ఇరికించాలని కుట్ర చేస్తున్నారని భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. ఈకోణంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.



సతీష్‌కుమార్ మృతదేహం

చంపేశారా?

- 'పరకామణి' కేసులో సీఐడీ విచారణకు వస్తున్న మాజీ ఏవీఎస్వో అనుమానాస్పద మృతి
- గాయాలను బట్టి హత్యగా అనుమానిస్తున్న పోలీసులు
- ఈ కేసులో ఫిర్యాదు చేసింది.. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నదీ సతీష్‌కుమారే

పరకామణిలో చోరీని పసిగట్టి ఫిర్యాదు చేసిన పోలీసు అధికారి సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి తీవ్ర సంచలనంగా మారింది. తిరుపతిలో సీఐడీ విచారణకు వచ్చే క్రమంలో తాడిపత్రి సమీపంలో రైలుపట్టాల పక్కన ఆయన మృతదేహం పడుంది. ఆయన మృతదేహం మీద ఉన్న గాయాలను బట్టి హత్య కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో కేసు విచారణకు హాజరవుతున్న వారిలోనూ భయాందోళనలు పెరుగుతున్నాయి. పరకామణి కేసులో రాజీచేసిన తీరును హైకోర్టు తప్పుపట్టిన నేపథ్యంలో మొదలైన సీఐడీ విచారణలో ఏ నిజాలు బయటపడతాయో అనే ఆందోళనతోనే సతీష్‌కుమార్‌ను అంతమొందిచారా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ మరణం రాజకీయ వివాదంగా మారుతోంది. హత్య అని కొందరూ, అనుమానమని మరికొందరూ, తమపై కుట్ర అని ఇంకొందరూ భిన్న వాదనలతో మీడియా ముందుకు వస్తున్నారు. ఇప్పటికే ఒకసారి సతీష్‌కుమార్‌ను సీఐడీ విచారించింది. మరోమారు విచారణకు ఆయన హాజరవుతున్న సమయంలో ఈ సంఘటన జరగడం అనుమానాలకు బలం ఇస్తోంది. ఈ వార్త తెలియగానే సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆగమేఘాలపై సంఘటనస్థలికి ప్రయాణమయ్యారు.

సౌమ్యుడు సతీష్‌కుమార్

- టీటీడీలో ఏడేళ్లకుపైగా విధులు
- గుర్తు చేసుకుంటున్న ఉద్యోగులు



తిరుమల, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారిగా చురుగ్గా సుదీర్ఘకాలం సేవలందించిన సతీష్‌కుమార్ మృతి టీటీడీ ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారిలా కాకుండా టీటీడీ ఉద్యోగిలానే ఆయన వ్యవహరించేవారని గుర్తు చేసుకుంటున్నారు. తన సెక్టార్ కాకపోయినప్పటికీ ఎక్కడ సమస్య ఎదురైనా సతీష్‌కుమార్ ఇట్టే వాలిపోయి సేవలందించేవారని అంటున్నారు. విధుల్లో ఆయన భక్తులతో ఎంతో సౌమ్యంగా వ్యవహరించేవారు. శ్రీవారి పరకామణి లెక్కింపు చోరీ కేసులో ఈయన ఫిర్యాదుదారునిగా ఉండడంతో తీవ్రమైన చర్చ జరుగుతోంది.



భార్య మమత, కుమారుడు తారా సతీష్, కుమార్తె లోహితాశ్వాతో సతీష్‌కుమార్ సెల్ఫీ (ఫైల్ ఫొటో)



ఘాట్‌రోడ్డులో తమను అనుమతించాలని నిరసన వ్యక్తం చేస్తున్న ద్విచక్రవాహనదారులకు నమస్కరించి వెనక్కి వెళ్లిపోవాలని కోరుతున్న ఏవీఎస్వో సతీష్ (ఫైల్ ఫొటో)

విజిలెన్స్‌లో ఏడేళ్లు

కర్నూలు జిల్లాలోని పత్తికొండకు చెందిన వై సతీష్‌కుమార్ రిజర్వ్ ఎస్ఐగా విధుల్లో చేరారు. 2017 జూలై 27న టీటీడీ విజిలెన్స్ విభాగానికి విజిలెన్స్ ఇన్స్పెక్టర్‌గా వచ్చారు. తొలుత శ్రీవారి ఆలయం, తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్ వీఐగా 2022 ఆగస్టు 1వరకు విధులు నిర్వహించారు. ఆ తర్వాత మాతృసంస్థకు బదిలీ అయ్యారు. సీఐగా పదోన్నతి లభించింది. దీంతో నెల వ్యవధిలోనే 2022 సెప్టెంబరు 27న తిరిగి శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు పరకామణి ఏవీఎస్వో (అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్)గా నియమితులయ్యారు. 2023లో పరకామణి దొంగతనం కేసు జరిగే వరకు అక్కడే ఏవీఎస్వోగా ఉన్నారు. ఆ తర్వాత సెక్టారు3, లగేజీ ఏవీఎస్వోగా విధులు చేపట్టారు. అదే ఏడాది చివరిలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఏవీఎస్వోగా బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది జూన్ 4వరకు పనిచేశారు. మొత్తంగా పలు సెక్టార్లలో ఏడేళ్ల ఆరునెలల పాటు విధులు నిర్వహించారు.

తిరుమలలో శ్రీచరణి



శ్రీవారి దర్శనార్థం మహిళా క్రికెటర్ శ్రీచరణి శుక్రవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్నారు. వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. శనివారం ఉదయం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మినీ మాల్స్‌గా రేషన్ షాపులు

- త్వరలో తిరుపతిలో 15 ఏర్పాటుకు చర్యలు



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరాలో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. రేషన్ షాపులను మినీ మాల్స్‌గా మార్చనుంది. దీనికిగాను తిరుపతి నగరంలో 10.. తిరుపతి రూరల్‌లో మరో ఐదు రేషన్ దుకాణాలను ఎంపిక చేసింది. దీంతో ఇక్కడ వున్న రేషన్ షాపులను మినీ మాల్స్‌గా మార్చడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తిరుపతిలోని గిరిపురం(షాపు నెంబరు 9), వరదరాజనగర్ (15), తారకరామానగర్(17), పెద్దకాపులేఅవుట్(33), పోస్టల్ కాలనీ(49), ఎస్టీవీ నగర్(52), ఎన్జీఐ కాలనీ(55), బైరాగిపట్టెడ(58), టీటీఆర్ కాలనీ(88), జయశంకర్ కాలనీ(90)లోని రేషన్ దుకాణాలను మినీమాల్స్‌గా మార్చేందుకు ఎంపిక చేశారు. ఇక తిరుపతి రూరల్‌లో అవిలాల(7), ఎన్టీఆర్ కాలనీ(35), ధనలక్ష్మినగర్(44), యోగిమల్లవరం(47), కొత్త చెర్లోపల్లి(42) దుకాణాలు ఎంపికయ్యాయి. మినీ మాల్స్‌గా మార్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ గిరిజన కార్పొరేషన్‌కు సంబంధించి సోపులు, టీ, కాఫీ పొడి, సీకాయ పొడులు, తేనె, ఊదివత్తులు, పసుపు, కుంకుమ, కుంకుడు కాయలు, పండ్లు, ఆకుకూరలు, ఉసిరి కాయలు, వట్టి వేర్లు, దంపుడు బియ్యం, సహజ సిద్ధంగా దొరికే వివిధ రకాల వస్తువులు, నూనె, తాటి బెల్లం తదితర ఉత్పత్తులను విక్రయించనున్నారు.

◆ ఆనందరెడ్డి

మళ్లీ సస్పెన్షన్

- అవినీతి ఆరోపణలతో రేణిగుంట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు

రేణిగుంట నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆనందరెడ్డి మళ్లీ సస్పెండయ్యారు. ఈయనపై అవినీతి ఆరోపణలు రావడంతో స్టాంపుల, రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించింది. గత నెల అనంతపురం, నెల్లూరు జిల్లాల డీఐజీలు రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా భూములు రిజిస్ట్రేషన్ చేయడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఆయన్ను సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఉంచడం గమనార్హం. ఇప్పటికే పలుమార్లు ఆయన సస్పెండయ్యారు.

- 2005లో ఆళ్లగడ్డలో సబ్ రిజిస్ట్రార్‌గా ఆనందరెడ్డి మొదటిసారి బాధ్యతలు స్వీకరించారు. 2007లో తిరుపతి రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరిన మూడు నెలలకే సస్పెండయ్యారు. దీనికి కారణం.. ఆళ్లగడ్డలో ప్రభుత్వ.. నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై విచారించగా వాస్తవమని తేలడమే.
- తిరిగి 2009లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టిన అప్పటి ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది.
- 2010లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన రెండు నెలల్లోపే వెస్ట్ చర్చికి సంబంధించిన స్థలాన్ని ఇద్దరికీ ఒకే రోజు.. ఒకే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ చలానాకు పన్నులు చెల్లించకపోవడంతో 2012లో డిస్మిషల్ ఫ్రం సర్వీస్ అయ్యారు.
- మళ్లీ 2015లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన హయాంలో ఏసీబీ తనిఖీలు చేయగా లెక్కలో లేని సొమ్మును సీజ్ చేశారు. దీనిపై 2016లో ఆనంద్‌రెడ్డిని డిస్మిషల్ ఫ్రం సర్వీస్ చేశారు.
- తిరిగి 2020లో వైసీపీ నాయకుల అండదండలతో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2022లో వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్లు చేయడం, రిజిస్ట్రేషన్ వేల్యూయేషన్ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిబంధనలకు అతిక్రమించి రేణిగుంట మండలంలోని అనుగుంట ప్రాంతంలో 5 రెట్లు పెంచేశారు. వీటిపై అప్పట్లో ప్రభుత్వం సస్పెండ్ చేసింది.
- తిరిగి 2022 డిసెంబరులో ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ తెచ్చుకొని సెలవుపై వెళ్లారని విమర్శలున్నాయి.
- 2025 మార్చి 14న రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో మళ్లీ అవినీతి ఆరోపణలు రావడం, ప్రభుత్వ విచారణలో వాస్తవమని తేలడంతో మరోసారి సస్పెండయ్యారు.





తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో శుక్రవారం రాత్రి కార్తీక మహాదీపోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక దీపారాధన చేశారు. వివిధ పూజా కార్యక్రమాల తర్వాత ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి ఆవిర్భావం నృత్యరూపకం ప్రదర్శించారు. తర్వాత భక్తులతో దీప మంత్రం మూడు సార్లు పలికిస్తూ సామూహిక లక్ష్మీనీరాజనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఒక్కసారిగా చేసిన దీపారాధనతో మైదానం వెలుగుతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వి.వీరబ్రహ్మం దంపతులు, ఆగమ సలహాదారు కృష్ణశేషాచల దీక్షితులు, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు, హెచ్‌డీపీ కార్యదర్శి శ్రీరాం రఘునాథ్, భక్తులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో కార్తీక మహాదీపోత్సవం





అవార్డు గెలుచుకున్న అమరరాజ బృందం సభ్యులు

13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్న 'అమరరాజ'

రేణిగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని తైపీ నగరంలో జరిగిన 50 వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్ ఐసిక్యూసిసి- 2025లో అమరరాజ తరపున పాల్గొన్న 13 బృందాలు 13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్నాయి. 14 దేశాలు నుంచి 884 బృందాలు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమరరాజ తరపున 13 బృందాలు గోల్డ్ అవార్డును సాధించాయి. అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ ఈఎంయాల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరీనేని, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై అమరరాజ సాధించిన ఈ గౌరవం అమర రాజా పరిశ్రమలో తయారయ్యే పరికరాల నాణ్యతకు గుర్తింపు అని పేర్కొన్నారు. 13 బంగారు అవార్డులు గెలుచుకున్న బృందాలకు అమరరాజ చైర్మన్ గల్లా జయదేవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,129

తలనీలాలు సమర్పించినవారు: 21,026



◆ కూటమి పాలనలో

పంచాయతీ ఖజానా గలగల

✳ వైసీపీ హయాంలో భవనాలకు అవినీతి కొలతలు ✳ భారీగా తగ్గిన ఆస్తి పన్ను రాబడి

✳ కూటమి ప్రభుత్వంలో రీ వెరిఫికేషన్‌తో వెలుగులోకి ✳ గతేడాదితో పోలిస్తే పెరిగిన రూ.10 కోట్లు

● తిరుచానూరు సమీపంలో ఓ స్టార్ హోటల్ 35వేల చదరపు అడుగుల్లో ఉంది. రికార్డుల్లో మాత్రం 8వేల చదరపు అడుగులు మాత్రమే చూపించారు. రూ.4.23లక్షల పన్ను కట్టించుకున్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలమేరకు పంచాయతీ అధికారులు ఇటీవల అదే హోటల్ భవన విస్తీర్ణాన్ని రీవెరిఫికేషన్‌చేస్తే 35వేల చదరపు అడుగుల్లో ఉన్నట్లు తేలింది. దీంతో రూ.9.71లక్షలు ప్రాపర్టీ ట్యాక్సు కట్టించారు. అంటే రూ.5 లక్షలకు పైగా పంచాయతీకి ఆదాయం వచ్చింది.

● ఏర్పేడు వద్ద ఓ ఇండస్ట్రీకి రూ.2.49 లక్షలు మాత్రమే ప్రాపర్టీ ట్యాక్సు కట్టించుకున్నారు. తీరా రీవెరికేషన్‌లో అదే పరిశ్రమ రూ.4.77 లక్షలు చెల్లించింది. ● గూడూరు వద్ద ఓ ప్రైవేటు పరిశ్రమ రూ.3.45 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.1.02 లక్షలే కట్టించుకున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిధిలోని భవనాల కొలతల్లో స్థానిక నేతలతో కలిసి కొందరు సిబ్బంది చేతివాటం చూపారు. దీనివల్ల పంచాయతీలకు ఆస్తి పన్ను రాబడి గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఆస్తి పన్ను వివరాలను ఆయా పంచాయతీల్లో ఆన్‌లైన్ చేశారు. ఆస్తి పన్నుతోపాటు వివిధ పన్నులను వరికి వారే చెల్లించుకునే సదుపాయం కల్పించారు. దీనికి తోడు ఆయా గ్రామ పంచాయతీల్లోని వాణిజ్యభవనాల (ప్రైవేట్ హోటల్స్, ఇండస్ట్రీస్, ఆస్పత్రులు) కొలతలు రీవెరిఫికేషన్ చేశారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో తక్కువ కొలతలు చూపారన్న విషయం వెలుగు చూసింది. తద్వారా దాదాపు రూ.10కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడిన విషయం బయటకు వచ్చింది. ఇలా తొట్టంబేడు, తిరుపతి రూరల్, వరదయ్యపాలెం తదితర మండలాల్లో మొత్తం వాణిజ్య భవనాలు, ఇళ్ల కొలతలు రీవెరిఫికేషన్ చేయగా దాదాపు రూ.10కోట్ల మేరప్రస్తుతానికి అదనపు ఆదాయం చేకూరింది. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ అధికారులు స్థానిక వైసీపీ నేతల సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గి సరిగా కొలతలు వేయకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



పెరిగిన ఆస్తి పన్ను రాబడి



పీఆర్ కమిషనరు కృష్ణతేజ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జరిపిన రీ వెరిఫికేషన్‌తో రూ.పది కోట్ల మేర అదనపు ఆదాయం లభించింది. పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెడుతూ ఆస్తి పన్ను చెల్లించే విధానాన్ని ఆన్‌లైన్ చేశారు. యూపీఐ ద్వారా పన్నుచెల్లించవచ్చు. ప ంచాయతీ సిబ్బందికి ఎక్కడా నగదు రూపంలో పన్ను చెల్లించవద్దు.

- సుశీలాదేవి, డీపీవో



వేదవిద్యార్థులకు కొత్త వస్త్రాలు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. ఏడాదికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలను పంపిణీ చేయడం ఆనవాయితీ. 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అందజేశారు. ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివసుబ్రహ్మణ్య అవధాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆనంద్‌సాయి





సుధీర్‌రెడ్డి - ఆనంద్‌సాయి, వాసుకీ

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యుడు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి, ఆయన సతీమణి వాసుకి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి 15వ పెళ్లి రోజు సందర్భంగా స్వామికి వస్త్రం సమర్పించి దర్శనం చేసుకున్నారు.

కొనసాగుతున్న 'నృత్య వాహిని'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో మూడు రోజులుగా చేపట్టిన నృత్య వాహిని కార్యక్రమం కొనసాగుతూ ఉంది. థాయ్‌లాండ్‌కు చెందిన నృత్యకారులు అక్కడి స్థానిక సంప్రదాయ నృత్యంతో అలరించారు. గుజరాత్‌కు చెందిన కళాకారులు గర్బా నృత్యంతో ఆకట్టుకున్నారు. వీరితో పాటు పలు ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులను ప్రదర్శించారు. వీరిని నృత్య వాహిని నిర్వాహకులు సత్కరించారు. శనివారం ఈ కార్యక్రమం ముగియనుంది.





రింగురోడ్డులో బైక్, కారు ఢీ

● ఒకరికి గాయాలు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల రింగురోడ్డులో శుక్రవారం బైక్, కారు ఢీకొని ఒకరు గాయపడ్డారు. క్షేత్రపాలకుని ఎదురుగా ఏర్పాటు చేసిన కొత్త రోడ్డులో నుంచి రింగురోడ్డులోకి వస్తున్న బైక్, ఎదురుగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న తిరుపతికి చెందిన వంశీకృష్ణారెడ్డి ఎడమకాలుకి గాయమైంది. అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు.



పదిలం పదిలం పసిహృదయం

● చిన్నారుల గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలన్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'దేశంలో వెయ్యి మంది చిన్నారుల్లో 8 మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి. వీరిలో 90 శాతం మందికి అవసరాన్ని బట్టి 3 నుంచి 4 ఆపరేషన్లు చేయాల్సి వస్తోంది. అందుకని ప్రతి ఒక్కరూ చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి' అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పదిలం పదిలం పసిహృదయం, చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన పేరిట స్విమ్స్‌లోని ఓపీడీ బ్లాక్‌లో పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పురిటి బిడ్డలకు వచ్చే గుండె జబ్బులను దృష్టిలో పెట్టుకొని దానిపై ప్రతీ ఒక్కరికీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మా తల్లిదండ్రులు సుశీలమ్మ, శ్రీనాధరావు పేరిట శ్రీనాథ సహృదయ సాహితి సంస్థను స్థాపించి అందులో భాగంగా పదిలం పదిలం పసిహృదయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో చిన్నారులకు గుండె జబ్బులు ఎందుకు వస్తాయి, దానిని ఎలా గుర్తించాలి, ఎలాంటి ఆపరేషన్లు చేస్తారు అనే విషయాలను స్పష్టంగా వివరించామన్నారు. పోస్టర్ల ద్వారా చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ చేతుల మీదుగా పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పసిపిల్లల గుండె జబ్బులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్ తదితరులు

15కేజీల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు



నిందుతుడు, గంజాయిని చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ హరిప్రసాద్ శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం బీఎన్‌కండ్రిగలో ప్రధాన రహదారిలో ఉన్న ఏఎంసీ చెక్‌పోస్టు దగ్గర తనిఖీలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తి తిరుపతికి వెళ్లడానికి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ నుంచి నుంచి ఆటోలో రాగా తనిఖీ చేశారు. అతడి నుంచి 15కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. తహసీల్దార్ శ్రీదేవి, వీఆర్‌ఓలు పంచనామా చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ బాధ్యత

● భారత శాస్త్ర అకాడమీ సదస్సు ప్రారంభోత్సవంలో రాఘవన్ వరదరాజన్

ఏర్పేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని జాతీయ విద్యా సంస్థ ఐసర్‌లో భారతశాస్త్ర అకాడమీ 91వ వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ రాఘవన్ వరదరాజన్ మాట్లాడుతూ.. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక చురుకైన సమగ్ర శాస్త్రీయ సంస్థగా ఎదిగి శాస్త్రీయ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలతో ముందంజలో ఉందన్నారు.శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ ప్రధాన బాధ్యత అన్నారు. ఈ ఏడాది జనవరి 1న కొత్త కౌన్సిల్ పదవీ బాధ్యతలు స్వీకరించిందని, అకాడమీ 91వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు.ప్రచురణ రంగంలో ఆకాడమీ 11జర్నల్స్‌లో మొత్తం 1,369 పరిశోధనా వ్యాసాలు ప్రచురించిందన్నారు.ఈ ఓపెన్‌యాక్సెస్ జర్నల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 46లక్షలకు పైగా డౌన్‌లోడ్స్ రావడం మనకు పెరుగుతున్న గుర్తింపు చూపిస్తోందన్నారు. సమ్మర్ రీసెర్చ్ సీఈవో శివకుమార్ కల్యాణ్‌రామన్ కూడా పరిశోధనలపై ప్రసంగించారు.





మాట్లాడుతున్న రాఘవన్ వరదరాజన్ - ఐసర్‌లో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై వివరిస్తున్న శాస్త్రవేత్త

బయో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

ఐసర్‌లో ఏర్పాటు చేసిన బయోసైన్స్ ల్యాబ్‌ను గురువారం రాత్రి ఏఎన్‌ఆర్‌ఎఫ్ సీఈవో శివకుమార్ కల్యాణ రామన్ ప్రారంభించారు.కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ క్లోహి తదితరులు పాల్గొన్నారు.



ఐసర్‌లో ఏర్పాటు చేసిన నీతికథలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యువ శాస్త్రవేత్తలకు ఆహ్వానం

తిరుపతి ఐసర్‌లో జరుగుతున్న భారత శాస్త్ర అకాడమీసదస్సు యువ శాస్త్రవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా వుంది. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తల నుంచి ఎన్నో విజ్ఞాన పరిజ్ఞానాలు యువ శాస్త్రవేత్తలు తెలుసుకోవడానికి వీలుగా వుంది.

- ఎస్వీ చలపతిరావు,
నేషనల్ సెంటర్ ఫర్‌ఎర్త్ సైన్స్ స్టడీస్, త్రివేండ్రం.

పరిశోధనల ఉపయోగంపై చర్చ

దేశంలో జరుగుతున్న పరిశోధనలు పబ్లిక్‌కు ఏ విధంగా ఉపయోగపడతాయో అనే అంశంపై పలువురు శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో మెలకువలపై చర్చలు జరిగాయి. కూరగాయలపంటలపై వస్తున్న వ్యాధులను అరికట్టేందుకు ఎలాంటి పరిశోధనలు చేస్తే బాగుంటుందనే ఎన్నో విషయాలను తెలుసుకున్నాం.

- డాక్టర్ నరసింహ,
వైరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్,
డీన్ ఎస్వీయూ,తిరుపతి

విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో శ్రీసిటీ ఎండీ



సత్యవేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థికాభివృద్ధిలో జపాన్ సంస్థల పెట్టుబడులు విస్తరిస్తూ భారత్ -జపాన్ పారిశ్రామిక బంధం మరింత బలపడుతోందని ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భారత్-జపాన్ భాగస్వామ్యం సెషన్‌లో రవీంద్ర సన్నారెడ్డి ప్యానెలిస్టుగా మాట్లాడారు. జపాన్ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందన్నారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా ఎదిగిందన్నారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన జపాన్ ఎన్‌క్లావ్‌లో 35కుపైగా కంపెనీలు పని చేస్తున్నాయని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా శ్రీసిటీ స్టాల్

సదస్సులో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యూహాత్మక స్థానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ప్రదర్శించే ఆకర్షణీయ డిజిటల్ ప్రదర్శనలు, త్రీడీ మోడళ్లతో పలువురి దృష్టిని ఆకర్షించింది. ఎఫ్ఎంసీజీ వస్తువులు, వివిధ ఎయిర్ కండిషనర్ బ్రాండ్లు, ఆటో మొబైల్ భాగాలు, వీల్‌చైర్లు, ఇసుజు వాహనాలతో సహా మేడ్, శ్రీసిటీ ఉత్పత్తుల ప్రదర్శన ప్రతినిధులను

సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ శివశంకర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ సోమశేఖర్‌రెడ్డికి ఎస్ఈగాను, డిప్యూటీ ఈఈ చంద్రానాయక్‌ను ఈఈగాను, అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న శ్రీధర్, నరేంద్రనాయుడును సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే ఏఈలుగా వున్న 25 మందిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను, ఏఏవోలుగా వున్న ఏడుగురిని అకౌంట్స్ ఆఫీసర్లుగాను, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న 19 మందిని ఏఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో నమోదై.. వారి కుటుంబంలోని వారి సంతాన ఓటరును అనుసంధానంచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి జేసీ మౌర్య అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2025పై విజయవాడ నుంచి చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ మౌర్య, ఇతర అధికారులు హాజరయ్యారు. సంతాన ఓటరు అనుసంధానం ప్రక్రియపై సమీక్షించారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య,అర్బన్ తహసీల్దారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేస్తున్న భూషణ్

తిరుమల, నవంబరు14(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. విజయవాడకు చెందిన మోనిష్ వెంకట సత్యప్రకాష్ తరపున భూషణ్ తిరుమలలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

'గ్రేటర్' విలీనానికి గాంధీపురం విముఖత

తిరుపతిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో గాంధీపురం గ్రామపంచాయతీని విలీనం చేయొద్దంటూ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. సర్పంచ్ ఎం.లక్ష్మీశివ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై విలీనం వద్దు..గ్రామపంచాయతీనే ముద్దు అంటూ నినాదాలు చేశారు. గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేదలపై పన్నుల భారం మరింతగా పెరుగుతుందని, సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మఠంభూములకు విలువని నిర్ధారించి రిజిస్ట్రేషన్‌కి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు అభిప్రాయ తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి లతాశ్రీకి అందజేశారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడి మృతి

పాకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు పిఆర్ మునస్వామి (79) శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఈయన మృతికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జయరామ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు, పాకాల యూనిట్ నేతలు కుప్పస్వామినాయుడు, కె.రామ్మూర్తి, జి.రామయ్య, కెఎస్ తులసీరామన్, పెన్షనర్లు సంతాపం తెలిపారు.



మునస్వామి (ఫైల్ ఫొటో)

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న వాకాడు వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ మర్రి ప్రమీల, టీడీపీ నాయకులు

కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మర్రి ప్రమీల అన్నారు. మండల పరిధిలోని గూడలి సచివాలయంలో శుక్రవారం గూడలి, రాజుపాళెం, దక్షిణపాలెం, ప్రకాశం కాలనీలకు చెందిన రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, రైతు కార్యదర్శి లొక్కు రఘునాథరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు ఉదయ భాస్కర్‌రెడ్డి, ధనంజయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని ఒకటోవ ప్లాట్‌ఫామ్ రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. రైల్వే జీఆర్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై చెన్నై వైపు వెలుతున్న రైలులో నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. 50 ఏళ్ల వయస్సు కలిగి బులుగు రంగు చెక్స్‌రంగు కలిగిన చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

కోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛ భారత్ నిధులతో మూడు సులబ్ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నారు. ఇందుకోసం శుక్రవారం తహసీల్దారు జయజయరావు, టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎంపీటీసీ షంషుద్దీన్ స్థల పరిశీలన చేశారు. తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఒకటి, ఆర్టీసీ సెంటర్‌లో 1, దాదారాయిగుంట సచివాలయం వద్ద మరో సులభ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు అధికారులు, టీడీపీ నాయకులు తెలిపారు.

అత్తారింటికి నిప్పుపెట్టిన అల్లుడి అరెస్టు

కోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో అత్తారింటిపై పెట్రోలు పోసి తగలబెట్టిన అల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిల్లకూరు మండలం వలిపేడుకు చెందిన ఏడుకొండలుకు కోట మండలం కొత్తపాళెంకు చెందిన శిరీషాతో వివాహమైంది. ఏడాది నుంచి ఏడుకొండలు తన భార్య శిరీషను వేధిస్తుండటంతో ఆమె పుట్టినిల్లు అయిన కొత్తపాళెం గ్రామానికి వెళ్లిపోయింది. దీంతో ఏడుకొండలు కొత్తపాళెం గ్రామానికి వెళ్లి అత్తారింటిపై పెట్రోలు తగలబెట్టి పరారయ్యాడు. శుక్రవారం అతనిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పీఈటీ బాలాజీ

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో మినర్వా పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ బాలాజీ అన్నారు. ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో షాట్‌పుట్‌లో కౌషిక్‌రెడ్డి ప్రథమస్థానం, ప్రవీణ్ కుమార్ తృతీయ స్థానం, హాకీలో గ్రీష్మిత ప్రథమ స్థానం, యోక్షిత ద్వితీయ స్థానం, బ్యూలానిర్విత తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

విద్యార్థినులకు కళ్ల అద్దాల పంపిణీ

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో విద్యార్థినులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ మినీ గురుకులంలో చదివే పేద విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రాఘవ రెడ్డి, వాసుగౌడ్, లక్ష్మీనారాయణ, కోదండరామయ్య, గిరిబాబు, సిద్దారెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

చిల్లకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా గురుకులంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అలాగే ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన శ్రీనాథ్, చరణ్‌తేజకు రూ. 5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. చదువుల ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, సురేష్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, అంగన్వాడీల్లో తనిఖీలు

వాకాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో సాయిప్రసాద్ తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాల జాబితాల ప్రదర్శన, రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాని పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందు తోందా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీ ఆర్‌డీ సీహెచ్ సురేష్‌బాబు, అంగన్వాడీ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని మున్సిపాలిటీ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. సూళ్లూరుపేట గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. తొలిరోజు బాలల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు విద్యార్థుల చేత పుస్తకాలు, పత్రికలను చదివించారు. కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకుంటే జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో ప్రయోజకులు అయ్యేందుకు ఎంతో ఉపయోగకరమన్నారు. ముందుగా జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, అధ్యాపకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులపై అవగాహన

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో శుక్రవారం విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థినులకు పీజీ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ హనుమంతు రావు మాట్లాడుతూ పీజీ కోర్సుల గురించి వివరించారు. ప్రధానంగా మెరైన్ బయాలజీ కోర్సు ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కోర్సులో అర్హత సాధించిన 15 మంది మెరిట్ విద్యార్థులకు నెలకు రూ.10 వేలు వంతున రెండు సంవత్సరాల పాటు ఫెలోషిప్ అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో విజయ, హనుమా రెడ్డి, వెంకటరాయులు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.10వేల జరిమానా

వాకాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ కోట కోర్టులో న్యాయమూర్తి కుమారి మీనాక్షి సుందరి తీర్పు ఇచ్చారని ఎస్ఐ నాగబాబు తెలిపారు. మండలంలోని తూపిలిపాళెం వద్ద శుక్రవారం ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారికి రూ.10వేల చొప్పున న్యాయ మూర్తి జరిమానా విధించారని ఎస్ఐ చెప్పారు.

విద్యాసామగ్రి పంపిణీ

పెళ్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే విజయశ్రీ తన సొంత నిధులతో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు స్వర్ణలత, ప్రభాదేవి, శ్రీనివాసులు, వీరశేఖర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేట రోడ్డులో మోడల్ స్కూల్ వద్ద, రైల్వేస్టేషన్ వద్ద మలుపు

ప్రమాదాలకు నిలయంగా మలుపులు

వెంకటగిరి టౌన్, నవంబరు 14 (నవంబరు): వెంకటగిరి పట్టణ సమీపంలోని రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధానంగా వెంకటగిరి - నాయుడుపేట మార్గంలోని ఏపీటీఎఫ్ కాలనీ, రైల్వేస్టేషన్ సమీపంలో, పెద్ద శివాలయం, ఆనందపురం వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో వద్ద ఎక్కడా సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రైల్వేస్టేషన్ సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద పిల్లలు రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే వెంకటగిరి నుంచి రాపూరు వెళ్లే మార్గంలో కాంపాళెం క్రాస్ వద్ద పెద్ద మలుపు ఉంది. ఇక్కడా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక వెంకటగిరి నుంచి నాయుడుపేట, గూడూరు వెళ్లే రోడ్లు అధ్వనంగా మారాయి. వెంకటగిరి మోడల్ స్కూల్ వద్ద పైపులైను తవ్వడంతో పెద్ద ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్: పాశం

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసే అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారంలోగా పరిష్కారం తెలియజేసేలా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కువగా రెవెన్యూశాఖకు సబంధించి ప్రజలు సమస్యలను విన్నవించడం జరిగిందన్నారు. రెవెన్యూశాఖలో అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో హరిజనవాడ శ్మశానానికి వెళ్లే రోడ్డును, గూడూరు నుంచి విందూరుకు వెళ్లే రోడ్డును, చవటపాళెం నుంచి దివిపాళెం వెళ్లేరోడ్డును అభివృద్ధి చేయాలని జనసేన నేత నాయకుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ప్రతి మండలంలో ప్రజాదర్బార్: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ఒక్కో మండల కేంద్రంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఇందులో భాగా శుక్రవారం పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన రీసర్వేతో రైతుల్లో అయోమయం నెలకొందన్నారు. దీంతో భూసమస్యలు పెరిగాయని, వాటికి పరిష్కారం చూపుతామని రైతులకు భరోసా కల్పించారు. అదేవిధంగా తాగు, సాగునీరు, పక్కా గృహాలు, విద్య, వైద్యం రోడ్లు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మ్యాన్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కొరత ఉందంటూ నాయకులు ప్రసాద్ రెడ్డి, హరినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జీలపాటూరు, చిల్లకూరు పంచాయతీలకు తాగునీరు స్వర్ణముఖినది నుంచి సరఫరా జరుగుతుందని, భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా మోటార్లు, పైపులైన్‌లు వరదకు కొట్టుకెళ్తున్నట్లు ఎమ్మెల్యేకు సర్పంచు కందమూడి శివకుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కేవీనాయుడు, నాయకులు పేరం రమేష్ నాయుడు, కందమూడి శివకుమార్, కలవకోలు మునీష్, కాటూరు గోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, నూతలపాటి ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, చైతన్యకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

నాయుడుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గురువారం అర్ధరాత్రి నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో తిరుపతి నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. అలాగే మేనకూరు సెజ్, మాంబట్టు, శ్రీసిటీలకు సంబంధించి ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచి రవాణాశాఖ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సంబంధించి రికార్డులు ఉండాలన్నారు. బస్సుల్లో అత్యవసర ద్వారాలు పనిచేస్తున్నాయా లేదా తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నామన్నారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే వారితో పాటు యాజమాన్యాలపై కూడా కేసులు నమోదు చేసి బస్సులను సీజ్ చేయనున్నట్లు డీఎస్పీ హెచ్చరించారు. డీఎస్పీ వెంట అర్బన్ సీఐ బాబి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి

కోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో శుక్రవారం విదార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి బాల బాలికలకు ఉన్న హక్కులు, చట్టాల గురించి వివరించారు. సమావేశంలో న్యాయవాదులు అత్తికాయల మోహన్, దేవారెడ్డి బాబురెడ్డి, వార్డెన్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త

తడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. అనంతరం వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ రాజమ్మ, న్యాయవాదులు ధర్మాప్రసాద్, లక్ష్మయ్య, నత్తం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అండగుండాల పాఠశాలలో ఉపాధ్యాయులు రఘు రామయ్య, ఉస్మాన్, పల్లిపాళెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గౌరీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు.

యూరియా పంపిణీ

బాలాయపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందజేస్తామని జయంపు సొసైటీ అధ్యక్షుడు సింగంశెట్టి భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం సొసైటీ కేంద్రం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మురళీ మోహన్‌రెడ్డి, మాధవనాయుడు, శేషమ నాయుడు, వెంకటేశ్వర్లు, రఘునాథ్ రెడ్డి, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

వెంకటగిరి టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటకు చెందిన యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. పట్టణానికి ఓ యువతిని జగదీష్ తేజ అనే యువకుడు ఆగస్టు 26న తీసుకెళ్లి పోయాడు. యువతి మైనర్ కావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పట్లోనే పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఆ యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కూడా వెంకటగిరికి తీసుకొచ్చి తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం మంజూరు హర్షణీయం

ఓజిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయడంపై టీడీపీ జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన ఓజిలిలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పిన విధంగా నెలకు రూ.15వేల వంతున తొమ్మిది నెలల గౌరవ వేతనం రూ.1.35 లక్షలను మసీదు ఖాతాలో జమ చేయడాన్ని హర్షించారు.

ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించండి

నాయుడుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీవద్ద 78వ నెంబరు రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీవాసుల ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆగస్టులో రైల్వే గేట్ మరమ్మతులకు గురైందని, అప్పటి నుంచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. స్థానికులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు రాకపోకలను రైల్వేగేట్ దాటి రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. ఎవరైనా మృతి చెందితే శవాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్లేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. రైల్వే గేట్ మరమ్మతులు చేయడంతో పాటు అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తఱుకు చెందు, గోవిందు, శ్రీనివాస్, వెంకటేష్, మునస్వామి, శేఖర్, అశోక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిత

డక్కిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ భవిషత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు లన్నారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందుతుందన్నారు. అంగన్వాడీల్లో పోషకాహారం పంపిణీతో పాటు బాలల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వకృత్వ, వ్యాచరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థునులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించండి

చిల్లకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగుంట గ్రామంలో నిర్మిస్తున్న జిందాల్ పరిశ్రమ కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమ కోసం భుములిచ్చిన రైతులకు ప్రస్తుత ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే తమ గ్రామాన్ని ఏపీఐఐసీ పరిధి నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దారు శ్రీనివాసులు, సర్పంచు ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌కే యాచేంద్ర జయంతి



యాచేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కుమార్ రాజా, సర్వజ్ఞ కుమార యాచేంద్ర

వెంకటగిరి, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పెద్దరాజా, మాజీ ఎమ్మెల్యే వీవీవీ ఆర్‌కే యాచేంద్ర జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుమార్ రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర, వివిధ పార్టీలకు నాయకులు కైవల్యానది వంతెన వద్ద ఉన్న వీవీవీ ఆర్‌కే యాచేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా కోటనాగయ్య

డక్కిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డక్కిలి డిప్యూటీ ఎంపీడీవోగా కోట నాగయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చీరాల నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

పశువైద్య శిబిరం

వాకాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలని కోవూరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని దుగరాజపట్నం పంచాయతీలోని రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎదకు రాని పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గొంతువాపు నివారణ, గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. అలాగే దూడలకు నట్టలనివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యులు కృష్ణారావు, మంజుల, రాజేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సభ్యులకు కోళ్ల పంపిణీ

తడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 50 మంది పొదుపు సంఘాల సభ్యులకు బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ చేతుల మీదుగా కోళ్ల పంపిణీ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఏపీవో రాజారెడ్డి, టీడీపీ నేత కొలవి సెల్వం పాల్గొన్నారు.